ఎడిటర్ : డా.దామా విజయ్‌కుమార్
మా కలం - సామాన్యుడి బలం
CELL : 9440352036
స్వర్ణసాగరం
WWW.SWARNASAGARAM.COM
PRGI : APTEL/26/A1104
జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
9440352036

ఆంధ్రప్రదేశ్ తెలంగాణ
సంపుటి : 1, సంచిక : 211
పేజీలు : 8
శుక్రవారం 23 అక్టోబర్ 2026
వెల : 2-00



2030 నాటికీ కాంగ్రెస్ గెలవలేదు

- కేజ్రీవాల్‌కు పంజాబ్‌లో పతనం తప్పదు
- దేశంలో కాంగ్రెస్ అనుసరిస్తున్న ప్రతికూల రాజకీయాల కారణంగా ఆ పార్టీ 2030 నాటికీ ఎన్నికల్లో విజయం సాధించదు
- త్వరలో పంజాబ్‌లో జరిగే ఎన్నికల్లో ఆప్‌ప్రభుత్వాన్ని ప్రజలు తగిన సమాధానం ఇస్తారు
- కేంద్ర హోంమంత్రి అమిత్ షా

2

ఏపీలో పరిషత్ నామినేషన్ల వేళ
రణరంగం

- పలుచోట్ల ఘర్షణలు, గాల్లోకి కాల్పులు
- ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు నామినేషన్లు
- కడప జిల్లా నందలూరులో టీడీపీ వర్గాల మధ్య రాళ్లదాడి, గాల్లోకి కాల్పులు
- కనిగిరి, యర్రగొండపాలెంలో వైసీపీ, టీడీపీ శ్రేణుల మధ్య ఘర్షణ
- శాంతిభద్రతల దృష్ట్యా కడపలో పలువురు వైసీపీ నేతల అరెస్ట్
- ఘర్షణల్లో వాహనాలకు నిప్పు, పలుచోట్ల పోలీసుల లాఠీఛార్జ్

అమరావతి, స్వర్ణసాగరం

రాష్ట్రంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ హింసాత్మకంగా మారింది. గురువారం పలు జిల్లాల్లో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య ఘర్షణలు చోటుచేసుకోగా, మరికొన్ని చోట్ల అంతర్గత వర్గపోరు భగ్గుమంది. రాళ్ల దాడులు, వాహనాలకు నిప్పు పెట్టడం, గాల్లోకి కాల్పులు జరపడంతో పలు ప్రాంతాల్లో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. వివరాల్లోకి వెళితే, కడప జిల్లా రాజంపేట నియోజకవర్గంలోని నందలూరులో పరిస్థితి అదుపుతప్పింది. టీడీపీలోని రెండు - మిగతా2లో

ఉద్దేశపూర్వకంగా హింసకు
పాల్పడుతున్నారు

- ఎంత వరకైనా పోరాడదాం: జగన్
- వైసీపీ ముఖ్య నేతలతో ఆ పార్టీ అధినేత జగన్ భేటీ
- స్థానిక ఎన్నికలకు సంబంధించి సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో చర్చ
- చంద్రబాబు ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా హింసకు పాల్పడుతోందని ఆరోపణ

అమరావతి, స్వర్ణసాగరం

వైసీపీ అధినేత జగన్ పార్టీ ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా జరుగుతున్న హింస, అక్రమాలపై సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల నేపథ్యంలో ఈ భేటీ జరిగింది. చంద్రబాబు ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా హింసకు పాల్పడుతోందని ఆరోపించిన జగన్, ప్రజాస్వామ్య పరిరక్షణకు న్యాయపోరాటం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. "చంద్రబాబు వ్యవస్థీకృతంగా, ఉద్దేశపూర్వకంగా హింసకు పాల్పడుతున్నారు. ప్రభుత్వాన్ని నడుపుతున్నవారే హింసకు పాల్పడటం ఎక్కడా చూసి ఉండం. పోలీసులను వాడుకుని ఈ దారుణాలన్నీ చంద్రబాబు చేయిస్తున్నారు" - మిగతా2లో

మున్సిపల్ ఎన్నికల
రీ షెడ్యూల్

- ఏపీలో 100 పట్టణ స్థానిక సంస్థలకు నవంబరు 1న ఎన్నికలు..
- సుప్రీంకోర్టు ఆదేశాలతో ఈసీ నిర్ణయం
- ఆంధ్రప్రదేశ్‌లో 100 పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికల షెడ్యూల్ విడుదల
- నవంబర్ 1న పోలింగ్, 3వ తేదీన ఓట్ల లెక్కింపు
- సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎన్నికల సంఘం నిర్ణయం

3లో



సెమీకండక్టర్ తయారీ యూనిట్లతో
సమగ్ర ఎకోసిస్టమ్

పెట్టుబడుల ఒప్పందాలు ఉత్పత్తి దశకు చేరాలి

అమరావతిలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన 22వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం

గతంలో చేసుకున్న ఒప్పందాలను కార్యరూపంలోకి తీసుకురావడంపై దృష్టి పెట్టాలి

విశాఖలో అంతర్జాతీయ స్థాయి కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటుకు సీఎం ఆదేశం

714 ఒప్పందాల్లో 519 ప్రాజెక్టులకు

అమరావతి, స్వర్ణసాగరం

రాష్ట్రంలో పెట్టుబడులను ప్రోత్సహించడంతో పాటు ఇప్పటికే కుదుర్చుకున్న ఒప్పందాలను కార్యరూపంలోకి తీసుకువచ్చి, ఉత్పత్తి ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఆయన అధ్యక్షతన క్యాంపు కార్యాలయంలో 22వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ) సమావేశం నిర్వహించారు. పరిశ్రమలు, ఇంధనం, పర్యాటకం, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల రంగాలకు సంబంధించిన వివిధ ప్రతిపాదనలపై సమావేశంలో చర్చించి ఆమోదం తెలిపారు. గతంలో కుదుర్చుకున్న మొత్తం 714 ఒప్పందాల్లో 519 ప్రాజెక్టులకు సంబంధించి కార్యాచరణ ప్రారంభించినట్లు అధికారులు వెల్లడించారు. పెట్టుబడుల సదస్సులు నిర్వహించేందుకు వీలుగా విశాఖపట్నంలో అంతర్జాతీయ స్థాయి అత్యుత్తమ కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటు అయ్యేలా - మిగతా2లో

ఈ పాపంలో ఎందుకు
భాగమయ్యారు

- విరాళాల చోరీపై మోదీ లక్ష్యంగా కాంగ్రెస్ ఆరోపణలు
- రామాలయ విరాళాల చోరీ జరిగి ఇన్ని రోజులు గడిచినా ఆ విషయంపై మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారు
- కోట్ల మందినుంచి సేకరించిన వేలకోట్ల రూపాయల విరాళాలు లూటీ అయ్యాయి
- కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్
- విచారణ నివేదికను ఎందుకు బహిర్గతం చేయలేదు

2

మచ్చర్‌తో కలిసి జ్యోతి
ప్రజ్వలన చేయండి

- ప్రధాని మోదీకి నెతన్యాహు ఆహ్వానం
- ప్రధాని మోదీతో ఫోన్‌లో ఇజ్రాయెల్ ప్రధాని మాట్లాడారు
- కెప్టెన్ స్మిత్ మచ్చర్‌తో కలిసి స్వాతంత్ర్య వేడుకల్లో జ్యోతిని వెలిగించాలని కోరారు.

మోదీ నా ఫ్రెండ్ అని చెప్పుకోవడం గర్వంగా ఉంది

- ప్రధాని నరేంద్ర మోదీపై పోలాండ్ ప్రధాని డొనాల్డ్ టస్క్ ప్రసంశల జల్లు
- ఆయన తన స్నేహితుడని చెప్పుకోడవం గర్వంగా ఉందని తెలిపారు.
- వాణిజ్యం, రక్షణ, సాంకేతికత సహా కీలక రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత విస్తరించడమే లక్ష్యంగా ఇరువురు నేతలు చర్చలు
- భారత్ వంటి శక్తివంతమైన దేశానికి నాయకత్వం వహిస్తున్న మోదీని నా స్నేహితుడిగా పిలుచకోవడం గర్వకారణం

2లో

మోదీ నా ఫ్రెండ్ అని చెప్పుకోవడం గర్వంగా ఉంది

భారత్‌తో తమ దేశానికి సానుకూల సంబంధాలు ఉన్నాయని, ఇరు దేశాల మధ్య ప్రయోజనాల సంఘర్షణకు తావులేదని పోలాండ్ ప్రధాని డొనాల్డ్ టస్క్ స్పష్టం చేశారు. భారత ప్రధాని నరేంద్ర మోదీని తన స్నేహితుడిగా చెప్పుకోవడం గర్వంగా ఉందని పేర్కొన్నారు. గురువారం దిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ప్రధాని మోదీతో కలిసి నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అంతర్జాతీయ వ్యవహారాల్లో భారత్ పోషిస్తున్న పాత్రను ప్రశంసించారు. వాణిజ్యం, రక్షణ, సాంకేతికత సహా కీలక రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత విస్తరించడమే లక్ష్యంగా ఇరువురు నేతలు చర్చలు జరిపారు.

"భారత్ వంటి శక్తివంతమైన దేశానికి నాయకత్వం వహిస్తున్న మోదీని నా స్నేహితుడిగా పిలుచుకోవడం గర్వకారణం. గత 35 ఏళ్లలో భారత్, పోలాండ్ దేశాలు అపూర్వమైన ఆర్థిక విజయాన్ని, వేగవంతమైన వృద్ధిని సాధించాయి. భారత్? ప్రగతిని, పోలాండ్ ఆర్థిక పురోగతిని ప్రపంచ దేశాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి. ప్రస్తుత ప్రపంచ పరిస్థితుల్లో రాజకీయ అనిశ్చితి, అస్థిరత పెరుగుతున్నాయి. ఇలాంటి సమయంలో అంతర్జాతీయ వేదికపై ప్రధాని మోదీ పోషిస్తున్న పాత్ర ఆశాజనంగా ఉంది. ప్రపంచ స్థాయిలో భారత్ ప్రాధాన్యం పెరుగుతుండటం మాకు సంతోషాన్ని కలిగిస్తోంది. ఇక ఇరు దేశాల సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి తీసుకెళ్లాలనే నిర్ణయం 2024 ఆగస్టులో మోదీ వార్సా పర్యటన సందర్భంగా తీసుకున్నాం. రెండు దేశాల మధ్య ప్రయోజనాల పరంగా విభేదాలు లేవు. చారిత్రకంగా విడదీసే సమస్యలు కూడా పెద్దగా లేవు. పరస్పర విశ్వాసం, ఉమ్మడి విలువలు, శాంతియుత మార్గాలపై నమ్మకమే తమ స్నేహానికి పునాది. పోలాండ్‌లో ప్రజాస్వామ్యం కోసం సాగిన



సాలిడారిటీ ఉద్యమం భారత్ అనుసరించిన అహింసా సంప్రదాయమే మాకు స్ఫూర్తినిచ్చింది. ఇరు దేశాల మధ్య ఉన్న ఈ విలువల సారూప్యత భవిష్యత్తులో సంబంధాలను మరింత బలోపేతం చేస్తుంది"

'యూరప్‌కు భారత్‌కు మధ్య వారధిగా పోలాండ్'

యూరప్‌తో భారత్ సంబంధాల విస్తరణలో పోలాండ్ కీలక పాత్ర పోషించగలదని టస్క్ పేర్కొన్నారు. యూరప్‌లో, ముఖ్యంగా మధ్య, తూర్పు యూరప్ ప్రాంతంలో పోలాండ్ ఆర్థికంగా ఎదుగుతోందని చెప్పారు. యూరోపియన్ యూనియన్ పరిధిలో ఇరు దేశాల సహకారానికి సంబంధించిన అంశాలపై గతంలో జరిగిన చర్చలు సానుకూల ఫలితాలిచ్చాయని తెలిపారు. ఈ ప్రయత్నాలు భారత్–పోలాండ్ వ్యూహాత్మక భాగస్వామ్యానికి బలమైన పునాది వేశాయని చెప్పారు. దీని ద్వారా భారత్, పోలాండ్‌తో పాటు యూరప్ కూడా ప్రయోజనం పొందుతుందని అభిప్రాయపడ్డారు. భారత్–పోలాండ్ సంబంధాల చరిత్రలో మార్చి 30వ తేదీకి ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని నిర్ణయించినట్లు టస్క్ వెల్లడించారు. ఇరు దేశాల మధ్య తొలి చర్చలు, సంబంధాలకు సంబంధించిన వార్షిక సందర్భాన్ని పురస్కరించుకుని ఆ రోజును 'భారత్–పోలాండ్ భాగస్వామ్య దినోత్సవం'గా గుర్తించనున్నట్లు తెలిపారు. జీ20 వంటి అంతర్జాతీయ వేదికలపైనా భారత్, పోలాండ్ పరస్పరం సహకరించుకోవాలని టస్క్ ఆకాంక్షించారు. ఇరు దేశాల ప్రయోజనాలతో పాటు ప్రపంచ సంక్షేమానికి దోహదపడేలా కలిసి పనిచేస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు.

ఆర్థిక సంబంధాలే కీలకం

భారత్– పోలాండ్ వ్యూహాత్మక భాగస్వామ్యంలో ఆర్థిక సంబంధాలకు అత్యంత ప్రాధాన్యం ఉందని టస్క్ వివరించారు. ఈ పర్యటనలో భాగంగా ఇరు దేశాలకు చెందిన కంపెనీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. తన వెంట పోలిష్ కంపెనీలు, వ్యాపార సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో వచ్చారని, ఇరు దేశాల సంబంధాల చరిత్రలో ఇదొక కీలకమైన వ్యాపార పర్యటన అని పేర్కొన్నారు. బొగ్గు గ్యాసిఫికేషన్, నౌకానిర్మాణం వంటి రంగాలతో పాటు అంతరిక్ష పరిశ్రమ, డిజిటలైజేషన్, ఉపగ్రహ సాంకేతికత, ఆధునిక రక్షణ వ్యవస్థల్లో ఉమ్మడి లక్ష్యాలను నిర్దేశించుకున్నట్లు వివరించారు. రక్షణ రంగంలో సాంకేతిక సహకారానికి విస్తృత అవకాశాలున్నాయని టస్క్ అన్నారు. ముఖ్యంగా డ్రోన్లు, ఉపగ్రహాల అభివృద్ధి, వినియోగంలో ఇరు దేశాలు కలిసి పనిచేయవచ్చని తెలిపారు. ఇటీవలి పరిణామాల్లో తమ దేశ డ్రోన్లు ఉపయోగకరంగా నిలిచాయని పేర్కొంటూ, రాజకీయ ఉద్రిక్తతలు, సంక్షోభ సమయాల్లో ఇటువంటి సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తుందని అభిప్రాయపడ్డారు.

2030 నాటికీ కాంగ్రెస్ గెలవలేదు

కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీని లక్ష్యంగా చేసుకుని కేంద్ర హోంమంత్రి అమిత్ షా గురువారం తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశంలో కాంగ్రెస్ అనుసరిస్తున్న ప్రతికూల రాజకీయాల కారణంగా ఆ పార్టీ 2030 నాటికి కూడా ఎన్నికల్లో విజయం సాధించదని పేర్కొన్నారు. చొరబాటుదారులను కాపాడటానికే ఓట్ల చోరీ జరిగిందంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిరంతరం తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. అదే సమయంలో ఆమ్ ఆద్మీ పార్టీపై కూడా తీవ్ర విమర్శలు గుప్పించారు. వచ్చే ఏడాది పంజాబ్‌లో జరిగే ఎన్నికల్లో ఆప్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని వ్యాఖ్యానించారు. పంజాబ్ నుంచి ఆప్ ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకిలిస్తారని హెచ్చరించారు. యమునా నదిని శుభ్రపరిచేందుకు చేపట్టిన రూ. 8,941 కోట్ల ప్రాజెక్టులను అమిత్ షా గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతిపక్షాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు.

"దశాబ్దాలుగా అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారంలోకి రాలేదు. ఈ ధోరణి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధికారంలోకి రాకముందు నుంచే జరుగుతోంది. కానీ, మీరు(ప్రతిపక్షాలు) అనుసరిస్తున్న ఈ ప్రతికూల రాజకీయాలను చూస్తుంటే, 2030 నాటికి కూడా ఎన్నికల్లో గెలవలేరు. అంతేకాదు, కాంగ్రెస్ పార్టీ ఎక్కడైతే గెలుస్తుందో అక్కడ ఎన్నికల సంఘం బాగా పనిచేస్తుందని, ఎక్కడ ఓడిపోతే అక్కడ ఈసీపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు.

అసలు విషయం ఏమిటంటే, నిరసనలు, ఆందోళనలు చేయడం వల్ల సాధించేదేమీ లేదు. ఇక యమునా నది విషయానికొస్తే, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ పాలకులు మురుగునీటిని వదిలేయడంతోనే యమునా నది కలుషితంగా మారింది. కానీ, బీజేపీ ప్రభుత్వం మాత్రం మురుగునీటి విడుదలను తగ్గించగలిగింది. యమునా నదికి పునరుజ్జీవం కల్పించిన తర్వాతే 2029 సార్వత్రిక ఎన్నికల కోసం ప్రజల మద్దతు కోరతాం."

'ఇప్పటికే 40 శాతానికి పైగా ప్రయాణాన్ని పూర్తి చేశాం'

దిల్లీలో పేరుకుపోయిన చెత్త కుప్పలను తొలగించడానికి గత ప్రభుత్వం ఏమీ చేయలేదని, కేవలం ఆందోళనలు, నిరసనల ద్వారానే రాజకీయాలు చేసిందని షా విమర్శించారు. కానీ, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం భారీ ప్రక్షాళన చేపట్టామని అన్నారు. రాజధానిలో పేరుకుపోయిన చెత్త డంపింగ్ ప్రదేశాలను ఖాళీ చేయడానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని షా గుర్తు చేశారు. "దిల్లీలో మా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మొదటి నెలలోనే మోదీ ఒక కీలక సమావేశాన్ని నిర్వహించారు. యమునా నది శుద్ధికి సంబంధించిన తన దార్శనికతను ఆయన దిల్లీ ప్రభుత్వానికి, హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖకు సమర్పించారు. ఇంత తక్కువ వ్యవధిలోనే, ఈ లక్ష్య సాధన దిశగా మనం ఇప్పటికే 40 శాతానికి పైగా ప్రయాణాన్ని పూర్తి చేశాం. మురుగునీటి శుద్ధి, తాగునీటికి సంబంధించిన వివిధ కార్యక్రమాలను కూడా కలిగి ఉన్న రూ.9,000 కోట్లకు పైగా విలువైన ఈ ప్రాజెక్టులు, ముఖ్యమంత్రి రేఖా గుప్తా ఇతర అధికారుల కృషి ఫలితంగా ఈ రోజు శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. కొత్తగా ప్రారంభించిన కార్యక్రమాలు నది సమగ్ర పునరుజ్జీవనానికి వెన్నెముకగా నిలుస్తాయి. అలాగే నగర తాగునీటి మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తాయి" అని షా నొక్కి చెప్పారు. అంతకుముందు, నక్సలిజాన్ని రూపుమాపినట్లే దేశం నుంచి మాదకద్రవ్యాల మహమ్మారిని కూడా తరిమేస్తామని అమిత్‌షా స్పష్టం చేశారు. 2029 డిసెంబర్ 31 నాటికి భారత్‌ను మాదకద్రవ్యాల రహిత దేశంగా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని నొక్కిచెప్పారు. అన్ని రాష్ట్రాల పోలీసులు కలసికట్టుగా, రానున్న మూడేళ్ల పాటు ఉమ్మడిగా పోరాడి మాదకద్రవ్యాల మహమ్మారిని దేశం నుంచి తరిమికొట్టాలని అన్నారు.

ఫ్రాన్స్ అల్లర్లకు, భారత్ నిరసనలకు లింక్..
ఫాక్స్ న్యూస్ రిపోర్ట్‌తో కాంగ్రెస్‌పై బీజేపీ ఫైర్

ఫాక్స్ న్యూస్ కథనాన్ని ఉటంకిస్తూ కాంగ్రెస్‌పై బీజేపీ తీవ్ర దాడి

ఫ్రాన్స్ అల్లర్లకు, భారత్‌లోని నిరసనలకు సంబంధం ఉందన్న రిపోర్ట్

ఇది కాంగ్రెస్ 'ప్రభుత్వాన్ని కూల్చే కుట్ర' అని ఆరోపణ

ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీపై బీజేపీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. ఫ్రాన్స్‌లో చోటుచేసుకున్న అల్లర్లకు, భారత్‌లో సీఈసీకి వ్యతిరేకంగా జరిగిన నిరసనలకు మధ్య సంబంధం ఉందంటూ అమెరికన్ మీడియా సంస్థ 'ఫాక్స్ న్యూస్' ప్రచురించిన కథనాన్ని బీజేపీ ఈ సందర్భంగా ఉటంకించింది. ఇది కేంద్ర ప్రభుత్వాన్ని కూల్చేందుకు కాంగ్రెస్ పన్నిన కుట్ర అని ఆరోపిస్తూ, రాహుల్ గాంధీ ద్రోహి అంటూ ఘాటు వ్యాఖ్యలు చేసింది. ఫాక్స్ న్యూస్ డిజిటల్ నిర్వహించిన పరిశీలనలో, 13 దేశాలకు చెందిన 101 సంస్థలు ఈ నిరసనలను సమన్వయం చేస్తూ మద్దతు ఇస్తున్నట్లు తెలిసిందని సదరు కథనం పేర్కొంది. ఫ్రాన్స్‌లోని అశాంతికి, భారత్‌లో యువత నేతృత్వంలో జరిగిన ప్రదర్శనలకు మధ్య అంతర్జాతీయ సంబంధాలు ఉన్నట్లు ఆరోపించింది. గురువారం ఈ నివేదికను ఆధారంగా చేసుకుని బీజేపీ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా మీడియా సమావేశంలో మాట్లాడారు. "ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ దేశంలో అరాచకాన్ని, ద్రోహాన్ని ప్రోత్సహించే నమూనాను ప్రదర్శిస్తున్నారు. ఈ కుట్రలకు విదేశీ ఏజెన్సీలతో సంబంధాలు ఉన్నాయని నేటి నివేదిక బట్టబయలు చేసింది. కాబట్టి, ఈ ద్రోహుల నాయకుడు ఎవరు? అని ప్రశ్నించడంలో తప్పు లేదు" అని భాటియా ధ్వజమెత్తారు. దురదృష్టవశాత్తు మన ప్రతిపక్ష నేత బాధ్యతారాహిత్యంగా, అపరిపక్వంగా వ్యవహరిస్తున్నారని, లభిస్తున్న ఆధారాల ప్రకార ఆయనను దేశద్రోహి లేదా మీర్ జాఫర్ అని పిలవడంలో అతిశయోక్తి లేదని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఫాక్స్ న్యూస్ రిపోర్ట్ ప్రకారం 'రెడ్–గ్రీన్ ఎకోసిస్టమ్ ఆఫ్ ప్రొటెస్ట్' నడుస్తోందని, ఇందులో 'రెడ్' అంటే కమ్యూనిస్ట్ వర్గాలని, 'గ్రీన్' అంటే ఇస్లామిక్ వర్గాలని ఆయన వివరించారు.

మంత్రులు, ఎమ్మెల్యేల కార్లకు ధరల పరిమితి..

తమిళనాడు ప్రభుత్వం మంత్రులు, శాసనసభ్యులకు కేటాయించే అధికారిక వాహనాల కొనుగోలుపై కొత్త నిబంధనలను అమల్లోకి తీసుకువచ్చింది. మంత్రులు, ఇతర సీనియర్ ప్రజాప్రతినిధులకు రూ. 26 లక్షల వరకు, ఇతర ఎమ్మెల్యేలకు రూ. 15 లక్షల వరకు గరిష్ఠ ధర పరిమితిని విధిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు శాసనసభ్యుల ప్రయాణ భత్యం నిబంధనలను సవరిస్తూ కొత్త గెజిట్ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. నూతన నిబంధనల ప్రకారం.. మంత్రులతో పాటు స్పీకర్, డిప్యూటీ స్పీకర్, ప్రతిపక్ష నాయకుడు, ప్రభుత్వ చీఫ్ విప్‌ల కోసం కొనుగోలు చేసే వాహనం ధర రూ. 26 లక్షలకు మించకూడదు. మిగతా ఎమ్మెల్యేలందరికీ ఈ పరిమితిని రూ. 15 లక్షలుగా నిర్ణయించారు. ఈ గరిష్ఠ ధరలోనే వాహనం ఎక్స్–షోరూమ్ ధర, పన్నులు, రిజిస్ట్రేషన్ ఛార్జీలు, మోటారు ఇన్సూరెన్స్ ప్రీమియంలు కలిసి ఉంటాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. అలాగే, ఏటా ఈ ధరల పరిమితిపై 5 శాతం పెంపునకు కూడా ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. వాహనాల కొనుగోలును కేంద్ర ప్రభుత్వానికి చెందిన "గవర్నమెంట్ ఈ–మార్కెట్‌ప్లేస్" పోర్టల్ ద్వారానే చేపట్టాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. కొనుగోలు చేసే వాహనాలు తప్పనిసరిగా భారత్ స్టేజ్–ఎ× ఉద్గార ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలి. మంత్రులకు కేటాయించే వాహనాలను తమిళనాడు ప్రభుత్వం తన పేరుపైనే కొనుగోలు చేస్తుంది. స్పీకర్, ఇతర శాసనసభ్యుల వాహనాల కొనుగోలు ప్రక్రియను అసెంబ్లీ సచివాలయం పర్యవేక్షిస్తుంది. మంత్రులు తమ పదవీకాలం ముగిసినప్పుడు, అనర్హత వేటుకు గురైనప్పుడు లేదా ఇతర కారణాలతో పదవిని కోల్పోయినప్పుడు తమకు కేటాయించిన వాహనాలను ప్రభుత్వానికి తిరిగి అప్పగించాల్సి ఉంటుంది. స్పీకర్, ఇతర ఉన్నత స్థాయి ప్రజాప్రతినిధులకు కూడా ఇదే నిబంధన వర్తిస్తుంది. అయితే, సాధారణ ఎమ్మెల్యేలు తమకు కేటాయించిన వాహనాల నిర్వహణ, మరమ్మతులు, ఇంధనం, డ్రైవర్ వేతనాల ఖర్చును వారికి చెల్లించే వాహన భత్యం నుంచే భరించాల్సి ఉంటుంది. ప్రజాప్రతినిధుల వాహన అర్హతలు, కొనుగోలు ప్రక్రియ, పరిపాలనా బాధ్యతలపై స్పష్టతనిస్తూ పబ్లిక్ డిపార్ట్‌మెంట్ సెక్రటరీ ఇ. సుందరవల్లి ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

ఆర్థిక సంక్షోభంలో అండగా నిలిచారు

తమ దేశం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న తరుణంలో అండగా నిలిచిన భారత ప్రభుత్వానికి, భారత ప్రజలకు శ్రీలంక ప్రభుత్వం హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపింది. న్యూఢిల్లీలో జరిగిన ఒక సదస్సులో పాల్గొన్న శ్రీలంక పరిశ్రమలు, వ్యవస్థాపక అభివృద్ధి శాఖ డిప్యూటీ మంత్రి చతురంగ అబేసింఘే ఈ వ్యాఖ్యలు చేశారు. అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో భారత్ తమకు వెన్నెముకగా నిలిచిందని ఆయన కొనియాడారు. 2022లో శ్రీలంకను చుట్టుముట్టిన తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని అబేసింఘే ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ఆ సమయంలో ఇంధనం, నిత్యావసరాల తీవ్ర కొరతతో పాటు ద్రవ్యోల్బణం ఆకాశాన్నంటడం, విదేశీ మారక ద్రవ్య నిల్వలు అడుగంటడంతో దేశం అల్లకల్లోల స్థితిని ఎదుర్కొందని వివరించారు. "ఆ కష్టకాలంలో మాకు తోడుగా నిలిచిన భారత ప్రభుత్వానికి, ప్రజలకు నా ధన్యవాదాలు. మీరు అందించిన ఆర్థిక సహాయం సంక్షోభం నుంచి గట్టెక్కడానికి మాకు ఎంతగానో దోహదపడింది" అని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం శ్రీలంక సంక్షోభం నుంచి పూర్తిగా కోలుకుందని, ఆర్థిక స్థిరత్వాన్ని సాధించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని అబేసింఘే తెలిపారు. రుణాల పునర్వ్యవస్థీకరణతో పాటు భవిష్యత్తులో ఇటువంటి పరిస్థితులు పునరావృతం కాకుండా కీలక సంస్కరణలు ప్రవేశపెట్టామని వివరించారు. భవిష్యత్తులో రుణ చెల్లింపుల విషయంలో ఎటువంటి రిస్క్ ఉండదని ఆయన ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు. ఇకపై దేశాన్ని స్థిరత్వం నుంచి వృద్ధి పథం వైపు నడిపిస్తామని, ఇందులో మౌలిక సదుపాయాల అభివృద్ధి కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి వెల్లడించారు. 1990లలో భారత్ క్రమంగా తన మార్కెట్లను తెరిచిన విధానం తమకు ఒక ఆదర్శమని అభిప్రాయపడ్డారు. పారా–టారిఫ్‌లను తొలగించడం, మరిన్ని స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడం వంటి చర్యలతో వృద్ధిని సాధిస్తామని చెప్పారు. 2019 నుంచి నిలిచిపోయిన అనేక ప్రాజెక్టులను ఇప్పుడు తిరిగి ప్రారంభిస్తున్నామని, రాబోయే 3 నుంచి 5 ఏళ్లలో పారిశ్రామిక, ఆర్థిక మార్పుల కోసం ఇతర దేశాలతో భాగస్వామ్యానికి సిద్ధంగా ఉన్నామని అబేసింఘే స్పష్టం చేశారు.

మచ్చర్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేయండి

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ప్రధాని నరేంద్ర మోదీతో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఫోన్‌లో సంభాషించారు. భారత్?తో దీర్ఘకాలంగా కొనసాగుతున్న సంబంధాలకు మరింత ప్రాధాన్యత ఇస్తూ, ఇజ్రాయెల్ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనాలని ప్రధాని

మోదీని ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఆహ్వానించారు. భారత పైలట్ స్మిత్ మచ్చర్‌తో కలిసి వేడుకల్లో జ్యోతి వెలిగించాలని కోరినట్లు వెల్లడించారు. ప్రధాని మోదీతో ఫోన్‌లో మాట్లాడిన అనంతరం నెతన్యాహు గురువారం సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఈ విషయాన్ని వెల్లడించారు. ఇరు దేశాల మధ్య ఉన్న బలమైన, చిరకాల సంబంధాలను మోదీ ప్రశంసించినట్లు తెలిపారు. భారత ప్రధాని మోదీతో మాట్లాడటం సంతోషంగా ఉందని నెతన్యాహు పేర్కొన్నారు. ఇజ్రాయెల్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహించే కార్యక్రమంలో భారత పైలట్ స్మిత్ మచ్చర్‌తో కలిసి జ్యోతి వెలిగించాలని మోదీని ఆహ్వానించినట్లు వివరించారు. ఈ ఆహ్వానానికి మోదీ కృతజ్ఞతలు తెలిపారని నెతన్యాహు వెల్లడించారు. ఉగ్రవాదంపై పోరాటంలో భారత్, ఇజ్రాయెల్ కలిసి పనిచేస్తున్నాయని మోదీ పేర్కొన్నట్లు తెలిపారు. భూమిపై మాత్రమే కాకుండా గగనతలంలోనూ ఇరు దేశాలు ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్నాయని మోదీ అభిప్రాయపడినట్లు నెతన్యాహు తన పోస్టులో వివరించారు. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు నుంచి ఫోన్? కాల్? వచ్చినట్లు ప్రధాని మోదీ తెలిపారు. ఈ మేరకు ఎక్స్?లో పోస్ట్ చేశారు. భారత్, ఇజ్రాయెల్ మధ్య ద్వైపాక్షిక సంబంధాల్లో సాధించిన వృద్ధిని ఇరు దేశాధినేతలు సమీక్షించినట్లు వెల్లడించారు. ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా తమ నిబద్ధతను ఇరువురు నేతలు పునరుద్ఘాటించారని తెలిపారు. అలాగే పశ్చిమాసియా పరిణామాలపై కూడా తమ అభిప్రాయాలను పంచుకున్నట్లు తెలిపారు. ఆ ప్రాంతంలో శాంతిని పునరుద్ధరించాల్సిన అత్యవసర అవసరాన్ని నొక్కి చెప్పినట్లు పేర్కన్నారు.

విమానంలో పైలట్‌పై దాడి

సెప్టెంబర్ 30న దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు బయలుదేరిన ఫ్లై దుబాయ్ విమానం ఎఫ్‌జెడ్1073లో ఈ ఘటన జరిగింది. విమాన కాక్‌పిట్‌లో సహ పైలట్ దాడి చేయడంతో భారతీయ పైలట్ స్మిత్ మచ్చర్ తీవ్రంగా గాయపడ్డారు. ఆ విమానంలో 27 మంది చిన్నారులు సహా మొత్తం 174 మంది ప్రయాణికులు ఉన్నారు. కాక్‌పిట్‌లో కత్తితో జరిగిన దాడిలో తీవ్ర గాయాలపాలైనప్పటికీ మచ్చర్ అసాధారణ ధైర్యాన్ని ప్రదర్శించారు. కాక్‌పిట్ తలుపు తెరవగలిగారు. దీంతో విమానంలోని ప్రయాణికులు, సిబ్బంది జోక్యం చేసుకుని దాడికి పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించారు. అనంతరం విమానాన్ని సౌదీ అరేబియాలో అత్యవసరంగా దింపారు.

ధైర్యసాహసాలకు ప్రశంసలు

విమానంలో జరిగిన తీవ్ర పరిస్థితుల్లో మచ్చర్ వ్యవహరించిన తీరుపై భారత్, ఇజ్రాయెల్ ప్రధానులు గతంలో ప్రశంసలు కురిపించారు. ప్రయాణికుల భద్రతకు ముప్పు ఏర్పడిన సమయంలో ఆయన చూపిన ధైర్యాన్ని ఇద్దరు నేతలూ అభినందించారు. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆయనకు ప్రత్యేక గుర్తింపు లభించే అవకాశం ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రస్తుతం మచ్చర్ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అయితే స్మిత్ మచ్చర్?కు ఇజ్రాయెల్ ప్రభుత్వం 'ప్రెసిడెన్షియల్ అవార్డ్ ఫర్ సివిలియన్ హీరోయిజం' పురస్కారాన్ని ప్రకటించింది. ఇది ఆ దేశ అత్యున్నత శౌర్య పురస్కారం.

భారత్–ఇజ్రాయెల్ సంబంధాలకు మరో గుర్తింపు

భారత్, ఇజ్రాయెల్ మధ్య రక్షణ, భద్రత, సాంకేతికత సహా పలు రంగాల్లో సహకారం కొనసాగుతోంది. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో పరస్పర సహకారం, భద్రతా అంశాలపై సమన్వయం ఇరు దేశాల సంబంధాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మోదీకి నెతన్యాహు పంపిన ఆహ్వానం దౌత్యపరంగానూ ప్రాధాన్యం సంతరించుకుంది.

ఉద్దేశపూర్వకంగా హింసకు పాల్పడుతున్నారు.

-మొదటిపేజీ తరువాయి

అని తీవ్ర స్థాయిలో విమర్శించారు. సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చినా క్షేత్రస్థాయిలో పరిస్థితి మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో వైసీపీ కార్యకర్తలు, నాయకులు ధైర్యం ప్రదర్శిస్తున్నారని జగన్ ప్రశంసించారు. "క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఘటనలపై ఆధారాల సేకరణ చాలా అవసరం. పటిష్ఠ ఆధారాలను కోర్టుల ముందు ఉంచడం ద్వారా న్యాయపోరాటం చేద్దాం. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఎందాకైనా పోరాటం చేద్దాం" అని జగన్ పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు.

యాంటీ బీజేపీ స్టాండ్ తో వైసీపీ

విశాఖపట్టణం : వైసీపీ వచ్చే పార్లమెంటు సమావేశాల్లో గళం విప్పనుందని తెలుస్తోంది. వైసీపీ ధినేత వైఎస్ జగన్ చేసిన వ్యాఖ్యలు కొంత కలకలం రేపుతున్నాయి. తాము కేంద్ర ఎన్నికల కమిషన్ నియామకంలో ఎన్డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లుకు మద్దతిచ్చి తప్పు చేశామని జగన్ చెప్పడాన్ని బట్టి ఇక ఢిల్లీపై పోరుకు జగన్ సిద్ధమయినట్లు కనిపిస్తుంది. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎన్డీయే నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వానికి గతంలో కొన్ని బిల్లుల విషయంలో మద్దతు ఇవ్వడంపై విచారం వ్యక్తం చేశారు. అయితే, ఆయన నేరుగా బీజేపీకి క్షమాపణలు చెప్పలేదు, కానీ కేంద్ర ఎన్నికల కమిషనర్ల నియామక బిల్లు-2023 విషయంలో నాడు ఎన్డీయే ప్రభుత్వానికి మద్దతు ఇచ్చి పెద్ద తప్పు చేశామని వ్యాఖ్యానించారు. దీంతో వైసీపీకి, బీజేపీకి ఇప్పుడు మరింత దూరం పెరిగిందని చెప్పొచ్చు. పార్టీ 2024 ఎన్నికలలో ఓటమి పాలయినా జగన్ పార్టీ బీజేపీలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి బిల్లుకు మద్దతిచ్చింది. 2023లో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఎన్నికల కమిషనర్ల నియామక సవరణ బిల్లుకు తాము మద్దతు ఇవ్వడం పొరపాటని జగన్ అభిప్రాయపడ్డారు. ఈ బిల్లు ద్వారా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ని నియామక కమిటీ నుంచి తొలగించి, ఆ స్థానంలో కేంద్ర మంత్రిని చేర్చారు. దీనికి వైఎస్సార్‌సీపీ మద్దతు ప్రకటించింది. ప్రస్తుతం కేంద్ర ఎన్నికల సంఘం పనితీరుపై, ఓటర్ల జాబితాల సవరణపై దేశవ్యాప్తంగా వస్తున్న ఆరోపణల నేపథ్యంలో జగన్ స్పందించారు. రాజ్యాంగబద్ధమైన సంస్థలపై ప్రజల్లో నమ్మకం కలగాలంటే మళ్లీ పాత నియామక పద్ధతినే సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ కమిటీలో ఉండేలా పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు.తాము గతంలో కేంద్రానికి కేవలం అంశాల వారీగా మాత్రమే మద్దతు ఇచ్చామని, అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు మరింత నమ్మకం కలిగించాల్సిన అవసరం ఉందని వైసీపీ నేతలు స్పష్టం చేస్తున్నారు.... అయితే జగన్ కాంగ్రెస్ నేతృత్వం వహిస్తున్న ఇండియా కూటమిలో భాగస్వామిగా మారతారని మాత్రం అనుకోవడానికి వీలులేదు. ఎందుకంటే కాంగ్రెస్ జగన్ కు ప్రధాన శత్రువు. అందుకే దానికి దూరంగా ఉండే అవకాశాలే ఎక్కువ ఉన్నాయి. అలాగని బీజేపీకి కూడా దగ్గరయ్యే ఛాన్సులు లేవు. ప్రస్తుతం పార్లమెంటులో ఏదైనా కీలకమైన బిల్లుల విషయంలో జగన్ పార్టీ ఇటు మద్దతు, అటు వ్యతిరేకత తెలపకుండా వాకౌట్ చేసే అవకాశాలున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

వైసీపీ 'సెల్ఫ్ గోల్' వ్యూహం !

విజయవాడ : విజయవాడ మేయర్ ఎన్నికల పోరులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న వ్యూహం ఆ పార్టీ ఉనికిని ప్రశ్నార్థకం చేసేలా ఉంది. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిలో ఎలాగైనా చిచ్చు పెట్టాలనే కుతంత్రంతో.. ఎన్నికల బరిలో ఉన్న మాజీ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావుకి వైసీపీ సోషల్ మీడియా, ద్వితీయ శ్రేణి నేతలు పరోక్షంగా పూర్తి మద్దతు ప్రకటిస్తూ ప్రచారం సాగిస్తున్నారు. ఈ ఎన్నికను ఎప్పటిలాగే పాత సామాజిక సమీకరణాలైన కమ్మ వర్సెస్ కాపు పోరుగా మార్చేయాలని చూస్తూ, ప్రధాన పోటీ వంగవీటి వర్సెస్ ఏబీవీ అన్నట్లుగా ఒక కృత్రిమ వాతావరణాన్ని సృష్టించేందుకు తాపత్రయపడుతున్నారు. కూటమి ఐక్యతను దెబ్బతీసి, కాపు-కమ్మ ఓట్లను చీల్చడం ద్వారా కూటమిలో రాజకీయ అగాధాన్ని సృష్టించాలనే కుయుక్తితోనే వైసీపీ ఈ పరోక్ష ప్రచారానికి తెరతీసింది.ఈ వికృత రాజకీయం నడుపుతున్న క్రమంలో వైసీపీ నాయకత్వం ఒక కీలకమైన ప్రాథమిక వాస్తవాన్ని పూర్తిగా విస్మరిస్తోంది.

సెమీకండక్టర్ తయారీ యూనిట్లతో సమగ్ర ఎకోసిస్టమ్

-మొదటిపేజీ తరువాయి

చూడాలని సీఎం సూచించారు. రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలకు ప్రాధాన్యమివ్వాలని స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని లాజిస్టిక్స్ హబ్‌గా తీర్చిదిద్దే క్రమంలో పోర్టులు, విమానాశ్రయాలు, రోడ్డు, రైల్వే కనెక్టివిటీతో పాటు తూర్పు, పశ్చిమ ప్రాంతాల అనుసంధానంపై దృష్టి సారించాలని ఆదేశించారు. సెమీకండక్టర్ రంగంలో తయారీ యూనిట్లతో కూడిన సమగ్ర ఎకోసిస్టమ్‌ను రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశానికి మంత్రులు నారా లోకేష్, టీజీ భరత్, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, నారాయణ, కందుల దుర్గేష్‌తో పాటు వివిధ శాఖల అధికారులు వర్చువల్‌గా హాజరయ్యారు.

ఏపీలో పరిషత్ నామినేషన్ల వేళ రణరంగం..

-మొదటిపేజీ తరువాయి

వర్గాలు తమ అభ్యర్థులే నామినేషన్ వేయాలని పట్టుబట్టడంతో వివాదం చెలరేగింది. టీడీపీ అధికార ప్రతినిధి బాలసుబ్రమణ్యం, మరో నేత విజయసాగర్ వర్గీయుల మధ్య మొదలైన వాగ్వాదం తీవ్ర ఘర్షణకు, రాళ్ల దాడికి దారితీసింది. ఈ ఘటనలో ఒక కారు, రెండు ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. ఆగ్రహంతో ఓ కారుకు నిప్పు పెట్టారు. ఈ క్రమంలో బాలసుబ్రమణ్యం గాల్లోకి ఐదు రౌండ్లు కాల్పులు జరపడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు లాఠీఛార్జ్ చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు. మరోవైపు, మార్కాపురం జిల్లా కనిగిరిలో నామినేషన్ల కేంద్రంలోకి అభ్యర్థితో పాటు ఇద్దరినే అనుమతిస్తామని పోలీసులు స్పష్టం చేయడంతో వైసీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. పోలీసులతో వాగ్వాదానికి దిగి, వారిపై దాడికి యత్నించడంతో అక్కడ టెన్షన్ వాతావరణం ఏర్పడింది. యర్రగొండపాలెంలోనూ టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య తోపులాట జరగగా, పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దారు. ఇక కడప జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా వైసీపీ అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి, మాజీ మంత్రి అంజాద్ బాషా, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి సహా పలువురు ముఖ్య నేతలను అరెస్ట్ చేసి అట్లూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న బద్వేల్ నియోజకవర్గ వైసీపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో స్టేషన్‌కు చేరుకోవడంతో అక్కడ కూడా ఉద్రిక్తత నెలకొంది.

మున్సిపల్ ఎన్నికల రీషెడ్యూల్..

సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో, ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల ప్రక్రియపై రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని 100 పట్టణ స్థానిక సంస్థలకు నవంబర్ 1న పోలింగ్ నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. నవంబర్ 3న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడిస్తామని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఈ షెడ్యూల్‌ను విడుదల చేసినట్లు ఎన్నికల సంఘం పేర్కొంది. ఇటీవల నామినేషన్ల పర్వంలో వివాదాలు తలెత్తిన నేపథ్యంలో కడప, తిరుపతి కార్పొరేషన్లతో పాటు రాజంపేట, మైదుకూరు మున్సిపాలిటీలలోని కొన్ని వార్డులకు సంబంధించి తిరిగి నామినేషన్లు స్వీకరించాలని ఈసీ నిర్ణయించింది. ఈ నాలుగు పట్టణాల పరిధిలో అక్టోబర్ 23, 24 తేదీల్లో మళ్లీ నామినేషన్లు స్వీకరించనున్నట్లు పునేఠా తెలిపారు. అక్టోబర్ 25న నామినేషన్ల పరిశీలన పూర్తి చేసి, అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారని వివరించారు. తిరిగి నామినేషన్లకు అవకాశం కల్పించిన వార్డుల వివరాలను కూడా ఈసీ వెల్లడించింది. దీని ప్రకారం కడప కార్పొరేషన్‌లో 11 వార్డులు, తిరుపతి కార్పొరేషన్‌లో 18 వార్డులు, రాజంపేట మున్సిపాలిటీలో 11 వార్డులు, మైదుకూరు మున్సిపాలిటీలో 32 వార్డులకు ఈ ప్రక్రియ వర్తించనుంది. ఈ షెడ్యూల్ విడుదలతో రాష్ట్రంలో ఎన్నికల కోడ్ తక్షణమే అమల్లోకి వచ్చినట్లు ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.

సీడీఎస్ఎల్ రీఇమేజిన్ ఐడియాథాన్ 2.0 ప్రారంభం

CDSL REIMAGINE | ideathon

విజయవాడ

వరల్డ్ ఇన్వెస్టర్ వీక్ 2026 సందర్భంగా సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్ (సీడీఎస్ఎల్) రీఇమేజిన్ ఐడియాథాన్ 2.0ను ప్రారంభించింది. దేశవ్యాప్తంగా విద్యార్థులు ఆర్థిక అక్షరాస్యత, ఇన్వెస్టర్ అవగాహన, సైబర్ భద్రతను పెంపొందించే వినూత్న పరిష్కారాలను రూపొందించేందుకు ఈ కార్యక్రమం అవకాశం కల్పిస్తోంది. 'సమాజ్ సే ఇన్వెస్టింగ్ సింపుల్' థీమ్‌తో చేపట్టిన ఈ కార్యక్రమం సెబీ 'ప్రాజెక్ట్ జాగరూక్' లక్ష్యాలకు తోడ్పడనుంది. సెబీ ఇన్వెస్టర్ సర్వే 2025 ప్రకారం దేశంలోని 33.72 కోట్ల కుటుంబాల్లో 3.21 కోట్ల కుటుంబాలు (9.5 శాతం) మాత్రమే సెక్యూరిటీస్ మార్కెట్ ఉత్పత్తుల్లో పెట్టుబడులు పెట్టగా, 63 శాతం కుటుంబాలకు కనీసం ఒక మార్కెట్ ఉత్పత్తిపై అవగాహన ఉంది. ఈ అంతరాన్ని తగ్గించడం అవసరమని సీడీఎస్ఎల్ పేర్కొంది. దేశంలో డీమ్యాట్ ఖాతాలు 23 కోట్లు దాటినప్పటికీ, 2025లో సైబర్ మోసాల వల్ల రూ.22,495 కోట్ల నష్టం వాటిల్లిందని, అందులో 76 శాతం నష్టాలు నకిలీ పెట్టుబడి, ట్రేడింగ్ మోసాల కారణంగానే జరిగినట్లు తెలిపింది. సీడీఎస్ఎల్ ఎండీ, సీఈఓ నేహాల్ వోరా మాట్లాడుతూ, ఇన్వెస్టర్లు సమాచారాన్ని విశ్లేషించి సరైన నిర్ణయాలు తీసుకునేలా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. యువతలో ఆర్థిక విజ్ఞానాన్ని పెంపొందించేందుకు అమర్ చిత్ర కథతో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు తెలిపారు. విద్యార్థులు మొబైల్ యాప్‌లు, వెబ్‌సైట్లు, చాట్‌బాట్‌లు, గేమ్‌లు, ఏఐ ఆధారిత సాధనాలు తదితర రూపాల్లో ఆలోచనలు సమర్పించవచ్చు. టీసీఎస్ మాజీ సీఈఓ, కర్మయోగి భారత్ చైర్‌పర్సన్ ఎస్. రామదొరై నేతృత్వంలోని నిపుణుల జ్యూరీ ఆవిష్కరణ, ప్రభావం, అమలు సాధ్యత, డేటా రక్షణ ఆధారంగా వాటిని పరిశీలిస్తుంది. అక్టోబర్ 7 నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయి. అత్యుత్తమ ఐదు జట్లకు మొత్తం రూ.11.5 లక్షల బహుమతులు అందజేయనున్నారు.

వైసీపీ ఎంపీటీసీ అభ్యర్థిగా చల్లా అలేఖ్య నామినేషన్

గన్నవరం

మండల పరిధిలోని అల్లాపురం, చిన్న ఆవుటపల్లి ఎంపీటీసీ సెగ్మెంట్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా చల్లా అలేఖ్య గురువారం నామినేషన్ దాఖలు చేశారు. మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ చేతుల మీదుగా పార్టీ బీఫారం అందుకున్న ఆమె, గన్నవరం ఎంపీడీవో కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి, గన్నవరం తహసీల్దార్ కె.వి. శివయ్యకు మధ్యాహ్నం 12.45 గంటలకు నామినేషన్ పత్రాలను సమర్పించారు. అనంతరం చిన్న ఆవుటపల్లిలోని డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రామ కన్వీనర్ కోటా వినయ్‌కుమార్, కోటా రాజకుమారి, కాంద్రు రాశేఖర్, చల్లా కరుణాకర్, దగాని ఇస్సాకు, సరిహద్దు శివయ్య, డోకాలా వెంకటరత్నం, పొనుగుమాటి రామలక్ష్మణరావుతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సానుభూతిపరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కూటమి జడ్పీటీసీ అభ్యర్థిగా కుమారస్వామి నామినేషన్

అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పిలుపు

గన్నవరం

మండల జడ్పీటీసీ కూటమి అభ్యర్థిగా బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడు కుమారస్వామి గురువారం నామినేషన్ దాఖలు చేశారు. మచిలీపట్నంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలు సమర్పించిన అనంతరం గన్నవరం పట్టణంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పాల్గొని కుమారస్వామికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చారిత్రక, రాజకీయ ప్రాధాన్యం కలిగిన గన్నవరం నుంచి కుమారస్వామి పోటీ చేయడం సంతోషకరమన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య, కాకాని వెంకటరత్నం వంటి నాయకులతో గుర్తింపు పొందిన ఈ ప్రాంతంలో కుమారస్వామి విజయానికి కూటమి శ్రేణులు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. నాలుగు దశాబ్దాలుగా బీజేపీకి అంకితభావంతో సేవలందిస్తున్న కుమారస్వామికి గతంలో పొత్తుల కారణంగా తగిన రాజకీయ అవకాశం దక్కలేదని, 1995లో తొలిసారిగా ఎంపీటీసీగా పోటీ చేసిన ఆయనకు ఇప్పుడు ప్రజల మద్దతు కోరే అవకాశం వచ్చిందని తెలిపారు. గన్నవరం మండల చరిత్రలోనే అత్యధిక మెజారిటీతో కుమారస్వామి విజయం సాధిస్తారనే నమ్మకం ఉందన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించే నాయకులే రాజకీయాల్లో ఉండాలని పేర్కొన్నారు. జిల్లా పరిషత్‌లో పరిస్థితులు అనుకూలిస్తే వైస్ చైర్మన్ పదవికి కూడా కుమారస్వామి పేరును పరిశీలించేలా ప్రయత్నిస్తానని వెల్లడించారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌తో పాటు కూటమి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కమలం గుర్తుపై ఓటు వేసి కుమారస్వామిని గెలిపించాలని, కృష్ణా జిల్లాలోనే అత్యధిక మెజారిటీ సాధించేలా కూటమి నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని యార్లగడ్డ కోరారు. ర్యాలీలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సిక్కోలులో విచిత్రం...
టీడీపీ అభ్యర్థే..వైసీపీ మేయర్

శ్రీకాకుళం : శ్రీకాకుళం టీడీపీ నేత గుండా లక్ష్మి దేవి పార్టీకి రాజీనామా చేశారు. మాజీ ఎమ్మెల్యే అయిన ఆమెకు గత ఎన్నికల్లో టిక్కెట్ నిరాకరించారు. కూటమి ప్రభుత్వంలో తను ఆశించిన ప్రాధాన్యత దక్కకపోవడం, పొత్తులో భాగంగా మేయర్ స్థానాన్ని జనసేనకు కేటాయించడంతో అసంతృప్తికి గురయ్యారు. అదే సమయంలో వైసీపీ నుంచి ఆమెకు మేయర్ ఆఫర్ వచ్చింది. మేయర్ టిక్కెట్ ఇస్తామని ఆశపెట్టడంతో పార్టీ మారాలని నిర్ణయించుకున్నారు.సుమారు 40 ఏళ్ల పాటు ఎన్టీఆర్ నుంచి చంద్రబాబు నాయకత్వం వరకు టీడీపీ అభివృద్ధి కోసం తన కుటుంబం అంకితమై పనిచేసిందని, అలాంటి పార్టీని ఇప్పుడు వీడాల్సి రావడం ఎంతో బాధగా ఉందని గుండ లక్ష్మీదేవి ఆవేదన వ్యక్తం చేశారు. తన భర్త, దివంగత మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ అడుగుజాడల్లో నడుస్తూ శ్రీకాకుళంలో పార్టీని కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చిన తనకు, కీలకమైన సమయంలో తగిన గుర్తింపు లభించలేదని ఆమె వాపోయారు. పార్టీ ఆవిర్భావం నుంచి కష్టపడిన తమను కాదంటూ స్థానికంగా కొందరు వ్యూహాత్మకంగా అణగదొక్కాలని చూశారని, ఈ అవమానాల భారాన్ని మోయలేకే పార్టీ వీడేందుకు సిద్ధమయ్యామని ఆమె తన సన్నిహితులు, అనుచరుల వద్ద ఆవేదన వెళ్లగక్కినట్లు తెలుస్తోంది.శ్రీకాకుళం మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత ధర్మాన ప్రసాదరావు రంగంలోకి దిగి గుండ లక్ష్మీదేవిని పార్టీలోకి ఆహ్వానించడంతో పాటు, శ్రీకాకుళం నగరపాలక సంస్థ మేయర్ అభ్యర్థిగా ఆమెను బరిలో దింపేందుకు రంగం సిద్ధం చేశారు. నగరంలో గుండ కుటుంబానికి ఉన్న బలమైన పట్టును, సామాజికవర్గ సమీకరణాలను దృష్టిలో ఉంచుకుని ఎన్నికల ఖర్చంతా పార్టీయే భరిస్తుందని హామీ ఇవ్వడంతో.. గుండ లక్ష్మీదేవి వైసీపీ కండువా కప్పుకోవడానికి ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. త్వరలోనే ఆమె తన అనుచరులతో విస్తృత సమావేశం నిర్వహించి అధికారికంగా ఫ్యాన్ పార్టీ గూటికి చేరనున్నట్లు తెలుస్తోంది.

విజయనగరంలో దెబ్బకు సిక్కోలులో రివేంజ్

స్థానిక సంస్థల ఎన్నికల ముంగిట ఉత్తరాంధ్ర రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. బొత్స మేనల్లుడు మజ్జి శ్రీనును తమ పార్టీలో చేర్చుకోవడం ద్వారా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి టీడీపీ షాకిచ్చింది. మజ్జి శ్రీను పార్టీ మారడం విజయనగరం జిల్లాలో వైసీపీకి గట్టి షాక్ అని చెప్పొచ్చు. జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో ఆయనకు అనుచరగణం ఉంది. మజ్జి శ్రీనుతోపాటు ద్వితీయ శ్రేణి నాయకులు కూడా టీడీపీలోకి వెళ్లారు. 2019 ఎన్నికల్లో విజయనగరం జిల్లాలో జగన్ పార్టీ క్లీన్‌స్వీప్ చేయడంలో ఈయన కీలక పాత్ర పోషించారు. పార్టీలో చేరగానే ఆయనకు అరకు లోక్ సభ టీడీపీ అబ్జర్వర్‌గా బాధ్యతలు అప్పగించారు.మజ్జి శ్రీనును చేర్చుకోవడం ద్వారా విజయనగరం జిల్లాలో వైసీపీని టీడీపీ దెబ్బకొడితే.. గుండ ఫ్యామిలీని తమవైపు తిప్పుకోవడం ద్వారా తెలుగుదేశం పార్టీకి శ్రీకాకుళంలో రివర్స్ షాక్ ఇవ్వడానికి వైసీపీ రెడీ అవుతోంది.శ్రీకాకుళం మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి టీడీపీకి రాజీనామా చేసి.. వైసీపీలో చేరబోతున్నారు. తెలుగు దేశం పార్టీతో గుండ ఫ్యామిలీకి 40 ఏళ్ల అనుబంధం ఉంది. 1982లో ఎన్టీఆర్ ఆహ్వానం మేరకు ఆమె భర్త గుండ అప్పల సూర్యనారాయణ టీడీపీలో చేరారు. అప్పల సూర్యనారాయణ వరుసగా నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయన మంత్రిగానూ పని చేశారు. 1985, 1989, 1994, 1999ల్లో ఆయన శ్రీకాకుళం ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే 2004, 2009 ఎన్నికల్లో ధర్మాన ప్రసాద రావు చేతిలో ఆయన ఓడిపోయారు. 2014 ఎన్నికల్లో అప్పల సూర్యనారాయణ సతీమణి లక్ష్మీదేవి ఎమ్మెల్యేగా గెలిచారు. 2019 ఎన్నికల్లో ఆమె ఓటమిపాలవగా.. 2024 ఎన్నికల్లో ఆమెకు టికెట్ కేటాయించలేదు. అప్పల సూర్యనారాయణ అనుచరుడిగా వ్యవహరించిన గోందు శంకర్‌కు టీడీపీ టికెట్ దక్కగా, ఆయన ఎమ్మెల్యేగా గెలిచారు.2026 జనవరి 12న అప్పల సూర్యనారాయణ కన్నుమూశారు. శ్రీకాకుళంలో రెండు చోట్ల ఆయన విగ్రహం ఏర్పాటు చేస్తామని తన కుమారులు చంద్రబాబు నాయుణ్ని కలిసి కోరారని.. పార్టీ అధినేత అంగీకరించినా, విగ్రహం ఏర్పాటు చేయనీయలేదని లక్ష్మీదేవి వాపోయారు. 40 ఏళ్లుగా పార్టీలో ఉంటున్న తమను అవమానాలకు గురి చేస్తున్నారని, తట్టుకోలేకే తాను పార్టీకి రాజీనామా చేస్తున్నానని ఆమె ప్రకటించారు.గుండ లక్ష్మీదేవి తన అనుచరులతో కలిసి వైఎస్సార్సీపీలో చేరబోతున్నారని ధర్మాన ప్రసాద రావు ఇప్పటికే బహిరంగంగా ప్రకటించారు. 50 వేల మంది అనుచరులతో ఆమె వైసీపీలోకి రాబోతున్నారన్నారు. గుండ లక్ష్మీదేవి ధర్మాన బ్రదర్స్‌కు వరుసకు సోదరి అవుతారు. టీడీపీలో గుండ ఫ్యామిలీ అసంతృప్తితో ఉన్న విషయాన్ని గమనించిన ధర్మాన ఆమెను వైసీపీలోకి ఆహ్వానించారని తెలుస్తోంది. గుండ లక్ష్మీదేవి వైసీపీలో చేరితే ఆమెకు మేయర్ టికెట్ ఇస్తామని.. ఖర్చు మొత్తం తామే భరిస్తామని ధర్మాన హామీ ఇచ్చినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. కోర్టు కేసు కారణంగా శ్రీకాకుళం కార్పొరేషన్ ఎన్నికలు ఇప్పుడు జరగడం లేదు. అంతేకాదు 2029 ఎన్నికల్లో ఆమె చిన్నకుమారుడు గుండ విశ్వనాథ్‌కు శ్రీకాకుళం ఎంపీ టికెట్ కూడా ఇచ్చే అవకాశం ఉందని సమాచారం.

శ్రీకాకుళం మేయర్ రేసులో వైసీపీ తరఫున గుండ లక్ష్మీదేవి నిలబడితే.. కూటమి అభ్యర్థికి గట్టిపోటీ ఎదురయ్యే అవకాశం ఉంది. శ్రీకాకుళంలో గుండ ఫ్యామిలీకి మంచి పట్టు ఉంది. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి సీట్ల పంపకాల్లో భాగంగా శ్రీకాకుళం మేయర్ స్థానాన్ని జనసేనకు కేటాయించారు. టీడీపీ ఓటు బ్యాంక్ పూర్తిగా జనసేనకు బదిలీ అవుతుందా అనేది ఒక ప్రశ్న. అలాగే గుండ లక్ష్మీదేవి వెంట ఆమె అనుచరగణం కూడా పార్టీ మారితే.. టీడీపీ ఓటు బ్యాంకుకు కూడా గండిపడుతుంది. ఈ రెండూ జనసేన అభ్యర్థికి పడే ఓట్లను ప్రభావితం చేసే అవకాశం ఉంది.అంటే విజయనగరంలో వైసీపీకి టీడీపీ షాకిస్తే.. జగన్ పార్టీ దానికి శ్రీకాకుళం బదులు తీర్చుకోనుందన్నమాట. ఈ రెండు పార్టీల వ్యూహాలు, ప్రతివ్యూహాలతో ఉత్తరాంధ్ర రాజకీయం రసవత్తరంగా మారుతోంది. అయితే ఈ పరిణామాలు శ్రీకాకుళం మేయర్‌గా పోటీ చేయనున్న జనసేనను టెన్షన్ పెట్టే అవకాశం ఉంది.

శుక్రవారం 23 అక్టోబర్ 2026

స్వర్ణసాగరం

4

స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన తేలే రామలక్ష్మి

కొయ్యలగూడెంస్వర్ణ సాగరం ప్రతినిధి అశోక్

త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో మండలంలో ఎన్నికల వాతావరణం వేడెక్కింది అందులో భాగంగానే నామినేషన్ల పర్వం రెండో రోజు కొనసాగింది గురువారం మంచి రోజు కావడంతో పలువురు నామినేషన్లు వేయడానికి ఆసక్తి చూపారు అందులో భాగంగానే మంగపతి దేవి పేట ఎంపీటీసీ సెగ్మెంట్ నుండి స్వతంత్ర అభ్యర్థిగా గ్రామస్తుల బలాన్ని కూడగట్టుకుని గ్రామానికి చెందిన మాజీ సొసైటీ డైరెక్టర్ తేలే శ్రీను భార్య రామలక్ష్మి బరిలోకి దిగి రెండు సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు ముందుగా మంగపతి దేవి పేట గ్రామం నుంచి వందలాది మోటార్ సైకిల్ తో ర్యాలీగా బయలుదేరిన ఆమె కొయ్యలగూడెంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు ఎన్నికల అధికారి సాయి

రమేష్ కు రెండు సెట్లు నామినేషన్ పత్రాలను సమర్పించారు అనంతరం అధికారుల నుంచి టెక్నాలజిమెంట్ కాపీని తీసుకున్న రామలక్ష్మి తమ గెలుపు దాదాపుగా ఖాయమైనట్లేనని ధీమా వ్యక్తం చేశారు తన భర్తకు ప్రజలలో ఉన్న పేరు ప్రఖ్యాతలు మరియు తాము చేస్తున్న సేవా కార్యక్రమాలు తమ గెలుపుకు దోహదపడతాయని ధీమా వ్యక్తం చేశారు మంగపతి దేవి పేట గ్రామంలో ప్రధాన సమస్యలు పరిష్కరించడంలో తాను ముందు ఉంటానని రామలక్ష్మి హామీ ఇచ్చారు గ్రామంలో రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యను పరిష్కరించేందుకు తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు అదే మాదిరిగా గ్రామంలోని స్మశాన వాటికలో మంచి నీటి బోరు నిర్మాణంతోపాటుగా లైట్లు ఏర్పాటు చేసి చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం చేసేందుకు కృషి చేస్తానని అన్నారు గ్రామంలోని రోడ్లు నిర్మాణం సీసీ డ్రైన్లు నిర్మాణం వీధి దీపాలు క్రమబద్ధీకరణ వంటి మౌలిక వసతులు కల్పించడంలో తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు ఆమె వెంట గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

కోడూరు తోటపల్లి గ్రామాల నుంచి టిడిపిలో చేరికలు

కిటకిటలాడిన సోమిరెడ్డి నివాసం

తోటపల్లి గూడూరు స్వర్ణ సాగరం అక్టోబర్ 22

మండలంలోని కోడూరు తోటపల్లి గ్రామాల నుంచి వైకాపా వీడి టీడీపీలోగురువారం సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి నివాసంలో చేరారు ఎమ్మెల్యే వారిని సాదరంగా ఆహ్వానించారు. పార్టీ సీనియర్లతో కలిసి సమిష్టిగా పనిచేయాలని సూచించారు. కోడూరు నుంచి టిడిపి స్థానిక నేత మాజీ సాగునీటి సంఘం అధ్యక్షులు వీరబోయిన గంగాధర్ నేతృత్వంలో వైసీపీలో కీలకంగా ఉంటూ అన్ని తానై వ్యవహరించినవార్డు సభ్యులు కోడూరు బిట్ వన్ దువ్వూరు శ్రీనివాసుల రెడ్డి (ఆగాల శీనయ)కొత్త కోడూరు కు చెందిన కోడూరు రాఘవరెడ్డిమరో ప్రముఖ వైద్యులు వార్డు సభ్యులు గోవిందరాజులు వారి వారి అనుచరులు ఎస్ సి బి సి వర్గాలు టిడిపిలో చేరిన వారిలో ఉన్నారు ఇక తోటపల్లి నుంచి స్థానిక సీనియర్ టిడిపి నేత పార్టీ క్రమశిక్షణకు లోబడి ఎమ్మెల్యేకు సన్నిహితులైన తోటపల్లి రామ్మోహన్ నాయుడు ఆధ్వర్యంలో యువకులు సీనియర్ నాయకులు టిడిపిలో చేరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైకాపా ధోరణి నచ్చక పలువురు ఆ పార్టీని వీడి తమ పార్టీలో చేరుతున్నారని తెలిపారు . పాతవారు కొత్తవారు సమైక్యంగా పనిచేసే స్థానిక సంస్థల ఎన్నికలలో విజయం సాధించాలని సూచించారు ఈ సందర్భంగా టిడిపి నేతలు కార్యకర్తలు అభిమానులతో సోమిరెడ్డి నివాసం కిక్కిరిసింది.

ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ తో మాగంటి బాబు, చింతమనేని నవ్యశ్రీ భేటీ

ఏలూరు,స్వర్ణ సాగరం ప్రతినిధి అశోక్

ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తో మాజీ ఎంపీ మాగంటి బాబు, చింతమనేని ప్రభాకర్ కుమార్తెహొనవ్యశ్రీ వేర్వేరుగా భేటీ అయ్యారు. ముందుగా గురువారం ఉదయం 10 గంటల సమయంలో ఎంపీ నివాసానికి వచ్చిన మాగంటి బాబు దంపతులు ఎంపీ తో భేటీ అయ్యారు, అనేక సంవత్సరాలుగా పార్టీకి, జిల్లాకు తమ కుటుంబం అందించిన సేవలను గుర్తించి, జడ్పీ చైర్ పర్సన్ అభ్యర్థిగా తన భార్య పద్మవల్లి అభ్యర్థిత్వానికి మద్దతు ఇవ్వాలని ఈ సందర్భంగా మాగంటి బాబు ఎంపీని కోరారు,ఉదయం 11 గంటల సమయంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కుమార్తె నవ్యశ్రీ తన భర్త పృథ్వీ కృష్ణతో కలిసి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ను ఆయన నివాసంలో కలిసారు,యువత రాజకీయాల్లోకి రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,యువనేత, మంత్రి నారా లోకేష్ పిలుపు మేరకు రాజకీయాల్లోకి ప్రవేశిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుత స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా జడ్పీ చైర్ పర్సన్ అభ్యర్థిగా పోటీ చేయాలని ఆశిస్తున్నట్లు చెప్పిన చింతమనేని నవ్యశ్రీ, తన అభ్యర్థిత్వానికి మద్దతు ఇవ్వాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ను అభ్యర్థించారు,జడ్పీ చైర్ పర్సన్ స్థానం ఆశిస్తున్న ఇద్దరు అభ్యర్థులు చెప్పినది విన్న ఎంపీ పుట్టా మహేష్ కుమార్,విషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకువెళతానని, అయితే పార్టీ ఎవరి అభ్యర్థిత్వాన్ని ప్రకటించినా అందరూ కలిసికట్టుగా, పార్టీ విజయం కోసం పనిచేయాలని సూచించారు.

యువజన శ్రామిక రైతు పార్టీ నుంచి నామినేషన్లు

తూపిలి ఉదయ్ కుమార్ రెడ్డి సంగారు రాకేష్ చిం తా సీనమ్మ గోని లక్ష్మి గోని సురేష్ ఉప్పల జయరాం గౌడ్ వెలసిరి నరసయ్య కాగోల్లుసీనమ్మ బుట్టి సుజాతఏ కుల భాగ్యమ్మ కవరగిరి వెంకమ్మ నెల్లూరు రాజేశ్వరి పేరం సుబ్రహ్మణ్యం నెలవాయి గోపి గాలిమల్లీశ్వరిలక్ష్మిఉన్నారు

జింక పిల్లను కాపాడిన స్థానికుడు.. స్పందించిన అటవీశాఖ అధికారులు

స్వర్ణ సాగరం శ్రీకాళహస్తి రూరల్

శ్రీకాళహస్తి,వేడం ఎస్టీ కాలనీలోకి వచ్చిన ఓ జింక పిల్లకు జన్మనిచ్చి అక్కడి నుంచి వెళ్లిపోయింది. ఈ విషయాన్ని గమనించిన అదే గ్రామానికి చెందిన పరుశురాం మూగజీవాల పట్ల మానవత్వాన్ని చాటుకున్నారు. జింక పిల్లను రక్షించాలనే ఉద్దేశంతో వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు వెంటనే అక్కడికి చేరుకుని జింక పిల్లను సురక్షితంగా తీసుకెళ్లారు. సకాలంలో స్పందించి జింక పిల్లను రక్షించేందుకు సహకరించిన పరుశురాంను స్థానికులు అభినందించారు. మూగజీవాల పట్ల ఆయన చూపిన ప్రేమ, మానవత్వం ప్రశంసనీయమని పేర్కొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలలో టిడిపి అఖండ విజయం

సర్వేపల్లి నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులుముత్యాల శ్రీనివాసులు

తోటపల్లి గూడూరుస్వర్ణ సాగరం అక్టోబర్ 22

స్థానిక సంస్థల ఎన్నికలలో టిడిపి విజయం ఖాయమని సర్వేపల్లి నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులుముత్యాల శ్రీనివాసులు పేర్కొన్నారుమండలంలోని ఇస్కపాలెం నుంచిమాజీ ఎంపీపీ ఇంగిలాల నిర్మలమ్మఇంగిలాల అంకమ్మ నామినేషన్లు దాఖలుసందర్భంగా మీడియాతో మాట్లాడారు.సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి స్ఫూర్తితోతోటపల్లి గూడూరు మండలం లో స్థానిక సంస్థల ఎన్నికలలోఆయా స్థానాలకుపోటీ చేసినఅభ్యర్థులు ఘన విజయం సాధిస్తారన్న ధీమావ్యక్తం చేశారు అభినందించిన వారిలోమాజీ సర్పంచ్ ఇంగిలాల చైతన్యకుమార్ గణేష్మాజీ ఎంపిటీసీ మధుసూదన్ గౌడ్టిడిపి నేతలుకుటుంబ సభ్యులు ఉన్నారు

RNI : APTEL/26/A2367
OFFICE : 9440352036
SWARNA SAGARAM TELUGU DAILY
స్వర్ణసాగరం
తిరుపతి
తెలుగు దినపత్రిక
చిత్తూరు | నెల్లూరు | అనంతపురం
విలేకరులు కావలెను
సంప్రదించండి : 9440352036

కుష్టు అనుమానిత మచ్చల సర్వేకు సహకరించాలి: డీపీఎంఓ సురేష్ బాబు

స్వర్ణసాగరం సూర్యాపేట జిల్లా అక్టోబర్ 22

తెలంగాణ ప్రభుత్వం అక్టోబర్ 22 నుండి నవంబర్ 4 వరకు నిర్వహించే కుష్టు అనుమానిత మచ్చల సర్వేకు ప్రజలంతా సహకరించాలని డిప్యూటీ పారామెడికల్ అధికారి (డీపీఎంఓ) మాతంగి సురేష్ బాబు కోరారు. గురువారం హుజూర్ నగర్ లోని సుందరయ్య నగర్ కాలనీలో జరుగుతున్న సర్వేను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శరీరంపై స్పర్శ లేని తెల్లని లేదా ఎరుపు రంగు మచ్చలు ఉండటం, కాళ్లు చేతుల్లో తిమ్మిర్లు రావడం, మొద్దుబారడం వంటి లక్షణాలు కనిపిస్తే ఇంటికి వచ్చే ఆశా కార్యకర్తలు లేదా ఆరోగ్య సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు.కుష్టు వ్యాధిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని,క్రమం తప్పకుండా చికిత్స తీసుకుంటే పూర్తిగా నయమవుతుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పద్మ, లెప్రసీ-టీబీ నోడల్ అధికారి ఇందిరాల రామకృష్ణ, ఆశా కార్యకర్తలు మాలతి, వినోద తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఎంపీటీసీ అభ్యర్థిగా అలివేలు మంగమ్మ నామినేషన్ .

స్వర్ణసాగరం. రామకుప్పం అక్టోబర్ 22

రామకుప్పం 1వ సెగ్మెంట్ ఎంపీటీసీ స్థానానికి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా అలివేలు మంగమ్మ నామినేషన్ పత్రాలు సమర్పించారు, గతంలో మండల తెలుగు మహిళా అధ్యక్షురాలుగా, ఎంపీటీసీ సభ్యురాలుగా సేవలందించానని ఆమె గుర్తుచేశారు, తనకు టికెట్ కేటాయించిన అధినేత చంద్రబాబు నాయుడుకు, నియోజకవర్గ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు, పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని, మహిళల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తానని స్పష్టం చేశారు, ప్రజలు తనకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు, నామినేషన్ కార్యక్రమంలో టీడీపీ శ్రేణులు భారీగా తరలివచ్చారు.

పోలవరం జడ్పీటీసీ అభ్యర్థినిగా సుంకర నాగమణి నామినేషన్

పోలవరం స్వర్ణ సాగరం ప్రతినిధి అశోక్

పోలవరం మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జడ్పీటీసీ అభ్యర్థినిగా సుంకర నాగమణి నామినేషన్ దాఖలు చేశారు,జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు నామినేషన్ పత్రాలు సమర్పించారు,వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థినిగా ఎన్నికల బరిలో నిలిచారు,నామినేషన్ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో తెల్లం రాజ్యలక్ష్మి ,జల్లేపల్లి పెద్దబ్బులు కూడా హాజరయ్యారు,నామినేషన్ దాఖలుతో పోలవరం మండలంలో రాజకీయ సందడి నెలకొంది,జడ్పీటీసీ ఎన్నికల్లో తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సుంకర నాగమణి సిద్ధమయ్యారు,నామినేషన్ కార్యక్రమం సందర్భంగా పార్టీ నాయకులు ఆమెకు మద్దతుగా నిలిచారు.

తోటపల్లి గూడూరులో రెండవ రోజు టిడిపి నామినేషన్లు

ఇంగిలాల నిర్మలమ్మ ఇంగిరాల అంకమ్మ చా వా సుదర్శన చావా సంధ్యారాణి మూగ లక్ష్మి కత్తిమమతయాట గిరి మంజుల వెంపులూరు మనోహర్, కైతేపల్లి సుధీర్, మోచర్ల రమేష్ చింతానాగరాణి ఉన్నారు

ఎట్టకేలకు వైసీపీకి రెండు నామినేషన్లు

పెళ్లకూరు స్వర్ణసాగరం అక్టోబర్ 22

పెళ్లకూరు మండలంలోని 10 ప్రాదేశిక సెగ్మెంట్లకు రెండో రోజు గురువారం ఎట్టకేలకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున రెండు నామినేషన్లు దాఖలు అయినాయి. పాలచూరు ఎంపీటీసీ స్థానానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున పాలూరు రత్నమ్మ మొట్టమొదటిగా నామినేషన్ వేశారు. అలాగే మాజీ జెడ్పిటిసి సభ్యురాలు నన్నెం ప్రిస్కిల్లా నెలబల్లి ఎంపీటీసీ స్థానానికి స్థానిక ఎస్సై ఆదిలక్ష్మి రక్షణతో నామినేషన్ కేంద్రానికి చేరుకుని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున నామినేషన్ వేశారు.

కొయ్యలగూడెం 4 వ సెగ్మెంట్ నుండి నామినేషన్ దాఖాలు చేసిన మేఘాల దేవి.

కొయ్యలగూడెం స్వర్ణ సాగరం ప్రతినిధి అశోక్

తెలుగుదేశం పార్టీలో 40 సవంత్సరాలు నుండి పార్టీ అధిష్టానం ఆదేశాలతో కష్టపడి పని చేసిన సినియర్ మహిళా నాయకురాలు మేఘాలదేవి పార్టీలో వున్న కార్యకర్తలకు అండగా భరోసాగా ఉంటూ ప్రజలకు మంచి చేయాలనే ఉద్దేశంతో ఈ రోజు నామినేషన్ వెయ్యటానికి కార్యకర్తలు అభిమానుల కోలాహలంతో వెళ్లి మేఘాల దేవి నామినేషన్ పత్రం ఎన్నికల అధికారికి అందచేశారు,ఎంపీపీ పదవి మహిళ జనరల్ కావడంతో, పదవి కోసం ఆశావహులు పోటీ పడుతుండగా సీనియర్ నాయకురాలు గంగిరెడ్ల మేఘాల దేవి పేరు ప్రధానంగా తెరపైకి వచ్చింది,నాలుగు దశాబ్దాలుగా పార్టీకి కార్యకర్తలకు అండగా నిలుస్తున్న గంగిరెడ్ల మేఘాలదేవికి ఈసారి అవకాశం దక్కాలని టిడిపి శ్రేణులు బలంగా కోరుతున్నాయి,40 సంవత్సరాల రాజకీయ ప్రస్థానంలో మేఘాలదేవికి ఇప్పటి వరకు తగిన గుర్తింపు లేదని కేడర్ లో అసహనం ఉంది,ఎంపీపీ పదవిని చేపట్టాలంటు కార్యకర్తల ఆమెపై ఒత్తిడి చేస్తున్నారు,పార్టీ అధిష్టానం మేఘాలదేవి కష్టాన్ని గుర్తించి మంచి నిర్ణయం తీసుకోవాలని పార్టీ శ్రేణులు ప్రజలు కోరుచున్నారు.

కనిగిరి వైఎస్సార్‌సీపీ ఇంఛార్జ్ డాక్టర్ దద్దాల సమక్షంలో టీడీపీ నుంచి వైయస్‌ఆర్‌సీపీలోకి 5 కుటుంబాల చేరిక

కనిగిరి స్వర్ణ సాగరం అక్టోబర్ 22

కనిగిరి మండలంలోని నేల టూరి గొల్లపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు వైసీపీ పార్టీలోకి ఐదు కుటుంబాలువారు కనిగిరి స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇంఛార్జ్ డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ సమక్షంలో మండల పార్టీ అధ్యక్షులు మడతల కస్తూరి రెడ్డి ఆధ్వర్యంలో కనిగిరి మండలం, నేలటూరు గొల్లపల్లి గ్రామానికి చెందిన 5 కుటుంబాల నాయకులు ముండ్లపాటి బాలరాజు, పెరికే వెలుగొండయ్య, కుంచం నాని, కుంచం ఏసు, అమ్మనబ్రోలు చిన్న అంజయ్య తెలుగుదేశం పార్టీని వీడి వైయస్‌ఆర్‌సీపీ చేరారు.ఇంఛార్జ్ దద్దాల నారాయణ యాదవ్ వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా వైయస్‌ఆర్‌సీపీలోకి ఆహ్వానించారు.సమిష్టిగా పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన సూచించారు.పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమం లో నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు వాకమల్ల రాజశేఖర్ రెడ్డి మరియు గ్రామ పార్టీ నాయకులు బీరం మల్లికార్జున రెడ్డి, సిద్దపురెడ్డి వెంకట నరసారెడ్డి, ముళ్లపాటి అబ్రహం, పెరికే దాసు, ముళ్లపాటి ఇజ్రాయెల్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సాగిన దేవీ శోభాయాత్ర

-- శ్రీనగర్ కాలనీలో ముగిసిన నవరాత్రి ఉత్సవాలు

-- పూజల్లో పాల్గొన్న కౌన్సిలర్ అట్లూరి మంజుల హరిబాబు

స్వర్ణసాగరం సూర్యాపేట జిల్లా అక్టోబర్ 22

హుజూర్‌నగర్ పట్టణ పరిధిలోని 19వ వార్డు,శ్రీనగర్ కాలనీలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా దేవీ శోభాయాత్ర భక్తిశ్రద్ధలతో వైభవంగా సాగింది. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహానికి కాలనీవాసులు, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో తొమ్మిది రోజుల పాటు విశేష పూజలు నిర్వహించారు.ఉత్సవాల చివరి రోజున అమ్మవారిని శ్రీ సరస్వతీ దేవి అలంకారంలో కొలువుదీర్చారు.ఈ కార్యక్రమానికి 23వ వార్డు కౌన్సిలర్ అట్లూరి మంజుల హరిబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి,తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం కాలనీ పురవీధుల్లో ప్రారంభమైన దివ్య శోభాయాత్రలో భక్తులతో కలిసి పాల్గొన్నారు. మంగళవాయిద్యాలు, కోలాటాలు,భజనల నడుమ సాగిన ఈ శోభాయాత్రలో మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని అమ్మవారికి నీరాజనాలు పలికారు.ఈ సందర్భంగా అట్లూరి మంజుల హరిబాబు మాట్లాడుతూ,విద్యార్థులకు చక్కటి విద్యాబుద్ధులు, జ్ఞానాన్ని ప్రసాదించే సరస్వతీ దేవి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.పట్టణ ప్రజలంతా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజలలో ఐక్యమత్యాన్ని, సద్భావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు, కాలనీ పెద్దలు,మహిళలు,యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.శోభాయాత్ర విజయవంతంగా ముగియడంతో భక్తులకు అన్నదాన ప్రసాద వితరణ చేపట్టారు.

ఆంధ్ర--తెలంగాణ సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు.

అక్రమ మద్యం, నగదు రవాణాపై నిఘా.. ఎస్సై క్రాంతి కుమార్ హెచ్చరిక.



జీలుగుమిల్లు స్వర్ణ సాగరం ప్రతినిధి అశోక్

జీలుగుమిల్లి (మం) తాటియాకులగూడెం వద్ద ఆంధ్ర--తెలంగాణ సరిహద్దు చెక్‌పోస్ట్‌లా పోలీసులు, ఎక్సైజ్ శాఖ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు,జీలుగుమిల్లి ఎస్సై వి. క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ తనిఖీల్లో తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోకి అక్రమంగా మద్యం తరలించకుండా, ఎన్నికల కోడ్ నిబంధనలకు విరుద్ధంగా నగదు రవాణా జరగకుండా అధికారులు నిఘా ఏర్పాటు చేశారు,ఈ సందర్భంగా ఎస్సై వి. క్రాంతి కుమార్ మాట్లాడుతూ,ఎన్నికల కోడ్ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని సూచించారు, తెలంగాణ నుంచి అక్రమంగా మద్యం తరలించినా,ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా నగదు రవాణా చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు,సరిహద్దు ప్రాంతాల్లో నిరంతరం తనిఖీలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం

సంక్షేమం, అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబాటు

మండల కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ బత్తుల శ్రీనివాస్ యాదవ్

స్వర్ణ సాగరం డోర్నకల్, అక్టోబర్ 22

పేదల సొంతింటి కలను సాకారం చేస్తూ, సంక్షేమం, అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని డోర్నకల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ బత్తుల శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ప్రభుత్వ విప్పు ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రనాయక్ సహకారంతో మండలంలోని బూరుగుపాడు గ్రామంలో నీలం విజయ--వీరయ్య నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం గురువారం గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు దబ్బ శ్రీను అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన గృహాన్ని ప్రారంభించి, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బత్తుల శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ..ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తోందన్నారు. అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ప్రజా పాలనలో సంక్షేమ పథకాలను అర్హులకు అందిస్తూ రాష్ట్ర అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరి హనుమ, కాసం శేఖర్, అంగోత్ వెంకన్న, ఉయ్యాలవాడ ఉపసర్పంచ్ నరసింహయ్య, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు నల్ల సురేష్, మధు, గ్రామ కాంగ్రెస్ నాయకులు, గ్రామ పెద్దలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న కూటమి ప్రభుత్వం

- కనిగిరి వైయస్‌ఆర్‌సీపీ ఇంఛార్జ్ డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్

వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పార్టీ శ్రేణులతో కలిసి రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేసిన దద్దాల, చింతలచెరువు, చిట్యాల

కనిగిరి స్వర్ణ సాగరం అక్టోబర్ 22

కూటమి ప్రభుత్వం అధికార బలంతో పోలీసు వ్యవస్థను అడ్డం పెట్టుకొని తమ పార్టీ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా బెదిరింపులకు గురిచేస్తోందని, భౌతిక దాడులు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని కనిగిరి నియోజకవర్గం వైఎస్‌ఆర్‌సీపీ ఇంఛార్జ్ డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ తీవ్రంగా ఆరోపించారు. గురువారం హనుమంతునిపాడు మండలం పార్టీ ఎంపీటీసీ అభ్యర్థుల నామినేషన్ కార్యక్రమానికి దద్దాల నారాయణ యాదవ్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి గారు, చిట్యాల విజయభాస్కర్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ దమ్ముంటే ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు నిర్వహించండి తాడో పేడో తేల్చుకుందామని కూటమి ప్రభుత్వానికి ఆయన సవాల్ విసిరారు. నామినేషన్ కేంద్రం వద్ద టీడీపీ మూకల అరాచకం పరాకాష్టకు చేరిందని దుయ్యబెట్టారు.కళ్ల ముందే ఈ దుర్మార్గం జరుగుతున్నా పోలీసులు ప్రేక్షకుల్లా చూస్తూ ఉండిపోయారని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి చీకటి రోజులు వస్తాయని ఎప్పుడూ అనుకోలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచే దమ్ములేక అక్రమాలకు, హింసకు పాల్పడుతున్నారని విమర్శించారు.ఎల్లకాలం కూటమి ప్రభుత్వమే అధికారంలో ఉండదని గుర్తు పెట్టుకోవాలన్నారు.రాబోయే రోజుల్లే ప్రజలే మీకు బుద్ధి చెపుతారని హెచ్చరించారు.

వేపలసింగారంలో క్షయ నిర్ధారణ శిబిరం

స్వర్ణసాగరం సూర్యాపేట జిల్లా అక్టోబర్ 22

హుజూర్ నగర్ మండల పరిధిలోని వేపలసింగారం గ్రామంలో గురువారం లింగగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్ష శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా 60 ఏళ్లు పైబడిన వారు,మధుమేహం,క్షయ వ్యాధి లక్షణాలు ఉన్నవారు, గత ఐదేళ్లుగా వ్యాధి బారిన పడిన బాధితులు, రెండేళ్లలో వ్యాధి నిర్ధారణ అయిన రోగుల కుటుంబ సభ్యులను గుర్తించారు.అలాగే మద్యం,ధూమపానం అలవాటు ఉన్నవారు,పోషకాహార లోపంతో తక్కువ బరువు ఉన్నవారికి ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించారు.అనుమానితుల నుంచి తెమడ నమూనాలు సేకరించి,తదుపరి పరీక్షల కోసం సూర్యాపేటలోని సీబీనాట్ ల్యాబ్‌కు పంపారు.ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పద్మ, టీబీ నోడల్ అధికారి ఇందిరాల రామకృష్ణ,గ్రామ కార్యదర్శి ప్రవీణ్ కుమార్,ఏఎన్ఎం స్వరూప,ఆశా కార్యకర్తలు మరియమ్మ,అనిత,జ్యోతి,జాన్ బీ తదితరులు పాల్గొన్నారు.

పోలవరంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్ల కార్యక్రమంలో కూటమి నేతలు

పోలవరం,స్వర్ణ సాగరం

పోలవరం నియోజకవర్గంలోని పోలవరం మండలంలో గురువారం నిర్వహించిన జడ్పీటీసీ,ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల కార్యక్రమంలో కూటమి అభ్యర్థుల తరఫున రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి,ఏపి ట్రైకార్ చైర్మన్ మరియు పోలవరం నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు పాల్గొన్నారు, ముందుగా మెయిన్ సెంటర్లో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు అనంతరం ర్యాలీగా బయలుదేరారు,కూటమి అభ్యర్థులకు మద్దతుగా వారు నామినేషన్ల కార్యక్రమంలో పాల్గొనగా, పలువురు కూటమి నాయకులు,కార్యకర్తలు కూడా హాజరయ్యారు, ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు సమన్వయంతో ముందుకు సాగుతున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు.

ఎమ్మెల్యే విజయశ్రీకి శాలువాతో సత్కారం..

జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఓజిలి మండల టిడిపి నాయకులు

ఓజిలి(స్వర్ణ-సాగరం)అక్టోబర్ 22

సూళ్లూరుపేట నియోజకవర్గ శాసనసభ్యురాలు నెలవల విజయశ్రీ జన్మదినాన్ని పురస్కరించుకుని ఓజిలి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పాడి వెంకటసుబ్బయ్య యాదవ్ మరియు టిడిపి నాయకులు గురువారం ఎమ్మెల్యే నివాసంలో ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా పాడి వెంకటసుబ్బయ్య యాదవ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని,ప్రజాసేవలో మరిన్ని సంవత్సరాలు కొనసాగుతూ,ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని మనస్ఫూర్తిగా భగవంతుడిని ప్రార్థించినట్లు తెలిపారు.ఆమెకు రానున్న రోజుల్లో మరింత మంచి జరగాలని,ప్రజల ఆశీస్సులతో సంతోషకరమైన జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు.ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులోనూ ప్రజలకు సేవ చేసే అవకాశాలు మరిన్ని కలగాలని పాడివెంకటసుబ్బయ్య యాదవ్ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ మండల టిడిపి అధ్యక్షులు గుజ్జలపూడి విజయ్ కుమార్ నాయుడు,మండల ప్రధాన కార్యదర్శి గుంటమడుగు కార్తీక్ రాజు,టిడిపి క్లస్టర్ ఇంచార్జి కంకణాల సత్య వరప్రసాదరావు,కురుగొండ సహకార సంఘం అధ్యక్షులు డాక్టర్ దారా అంకయ్య, పాదర్తి ప్రకాష్ నాయుడు,మైనారిటీ నాయకులు అల్లాబక్షు, భాస్కర్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విజయశ్రీకి డాక్టర్ దారా అంకయ్య జన్మదిన శుభాకాంక్షలు

ఓజిలి(స్వర్ణ-సాగరం)అక్టోబర్ 22:

సూళ్లూరుపేట నియోజకవర్గ శాసనసభ్యురాలు నెలవల విజయశ్రీ జన్మదినం సందర్భంగా తిరుపతి జిల్లా ఓజిలి మండలం కురుగొండ పీఏసీఎస్ అధ్యక్షుడు డాక్టర్ దారా అంకయ్య గురువారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా డాక్టర్ దారా అంకయ్య ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, రానున్న రోజులు మరింత ఆనందంగా సాగాలని, ప్రజలకు సేవ చేసే క్రమంలో మరిన్ని విజయాలు సాధించాలని అభిలషించారు. ఆమె జీవితంలో సంతోషం, ఆరోగ్యం, శ్రేయస్సు ఎల్లప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు.ఎమ్మెల్యే జన్మదినాన్ని పురస్కరించుకుని డాక్టర్ దారా అంకయ్య ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలియజేయడం ఈ కార్యక్రమంలో ప్రత్యేకతను సంతరించుకుంది.

నాయుడుపేటలో బీజేపీ ఎన్నికల సమరశంఖం!

నాలుగు వార్డుల్లో ఇంటింటా ప్రచారం.. రంగంలోకి రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి

కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి

నాయుడుపేట(స్వర్ణ-సాగరం) అక్టోబర్ 22

నాయుడుపేట మున్సిపాలిటీలో ఎన్నికల వేడి రాజుకుంటోంది. వార్డుల వారీగా అభ్యర్థులు ప్రజల్లోకి వెళుతుండగా, భారతీయ జనతా పార్టీ సైతం ప్రచార పర్వానికి శ్రీకారం చుట్టింది. ఎన్డీఏ కూటమి బలపరిచిన బీజేపీ అభ్యర్థులు పోటీ చేస్తున్న నాలుగు వార్డుల్లో నాయకులు, కార్యకర్తలు ఇంటింటా పర్యటిస్తూ ఓటర్లను కలిశారు. పార్టీ కరపత్రాలను పంపిణీ చేస్తూ అభ్యర్థులను పరిచయం చేసి, వారి విజయానికి మద్దతు ఇవ్వాలని కోరారు.

నాలుగు వార్డుల్లో బీజేపీ అభ్యర్థులు...నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు నుంచి మాచిరెడ్డి లక్ష్మి అనూష, 19వ వార్డు నుంచి కావేరిపాకం కోటేశ్వరరావు, 21వ వార్డు నుంచి పాపాడి రాజశేఖర్ రెడ్డి, 28వ వార్డు నుంచి కాంట్రాతి సుందరరావు బీజేపీ తరఫున కౌన్సిలర్ అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారు. వీరితో పాటు మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి షేక్ షకీరా విజయాన్ని కాంక్షిస్తూ పార్టీ నాయకులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు.

ప్రచారంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి...ఆంధ్రప్రదేశ్ భారతీయ జనతా పార్టీ ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి ప్రచార కార్యక్రమంలో పాల్గొని అభ్యర్థులతో కలిసి ఇంటింటికీ వెళ్లారు. ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను తెలుసుకున్నారు. బీజేపీ అభ్యర్థులకు అవకాశం కల్పించాలని కోరుతూ పార్టీ విధానాలు, అభివృద్ధి లక్ష్యాలను ప్రజలకు వివరించారు.

అభివృద్ధే లక్ష్యంగా ప్రజల్లోకి..ఈ సందర్భంగా సన్నారెడ్డి దయాకర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తోందని తెలిపారు. నాయుడుపేట మున్సిపాలిటీలోనూ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం, స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వడం అవసరమని అన్నారు.ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసే నాయకులను ఎన్నుకోవాలని, మున్సిపాలిటీ అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని ఓటర్లను కోరారు. రానున్న ఎన్నికల్లో నాలుగు వార్డుల బీజేపీ కౌన్సిలర్ అభ్యర్థులతో పాటు చైర్మన్ అభ్యర్థి షేక్ షకీరాకు తమ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

కార్యకర్తల్లో ఎన్నికల ఉత్సాహం...ప్రచారంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని కరపత్రాల పంపిణీతో పాటు ఓటర్లను నేరుగా కలిసి మద్దతు కోరారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ నాయకత్వం ప్రచార బరిలోకి దిగడంతో నాయుడుపేటలో రాజకీయ సందడి నెలకొంది. రానున్న రోజుల్లో ప్రచారం మరింత విస్తృతం కానుండటంతో వార్డుల్లో ఎన్నికల పోరు ఆసక్తికరంగా మారుతోంది.

ఓజిలి మండలంలో ఎంపీటీసీ నామినేషన్ల జోరు..రెండు రోజుల్లో 38 నామినేషన్లు

ఓజిలి(స్వర్ణ-సాగరం)అక్టోబర్ 22

తిరుపతి జిల్లా ఓజిలి మండలంలో ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియలో అభ్యర్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. నామినేషన్ల స్వీకరణలో భాగంగా మొదటి రెండు రోజుల్లో కలిపి మొత్తం 38 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు.ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో మండలంలో రాజకీయ సందడి నెలకొంది. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు, ఆశావహులు నామినేషన్ల దాఖలుపై దృష్టి సారిస్తున్నారు. నామినేషన్ల స్వీకరణకు సంబంధించిన నిబంధనలు, అవసరమైన పత్రాల విషయంలో అభ్యర్థులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.నామినేషన్ల ప్రక్రియ పూర్తయిన అనంతరం నిబంధనల ప్రకారం పరిశీలన, తదుపరి ఎన్నికల కార్యక్రమాలు కొనసాగనున్నాయి. రానున్న రోజుల్లో మరిన్ని నామినేషన్లు దాఖలయ్యే అవకాశం ఉండటంతో మండలంలో ఎన్నికల సందడి మరింత పెరగనుంది.

నామినేషన్ వేయకుండా అడ్డుకోవడం దుర్మార్గం

- వెలిగండ్ల మండలం ఎంపీపీ అభ్యర్థి గుంటక తిరుపతి రెడ్డి

కనిగిరి స్వర్ణ సాగరం అక్టోబర్ 22

ప్రజాస్వామ్యంలో అర్హులైన ప్రతి అభ్యర్థికి ఎన్నికల్లో నామినేషన్ వేసే హక్కు ఉంటుందని అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం, దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్ స్ఫూర్తికి విరుద్ధమని వెలిగండ్ల మండలం ఎంపీపీ అభ్యర్థి గుంటక తిరుపతి రెడ్డి మరియు పార్టీ శ్రేణులు పేర్కొన్నారు.వెలిగండ్ల మండల కేంద్రం దగ్గర కూటమి వాళ్ళు వైసీపీ కార్యకర్తలను కొట్టి నామినేషన్ వేయనీయకుండా చేశారు. నామినేషన్ వేయటానికి అవకాశం కల్పించాలి అంటూ ఎస్ఐ కాళ్లు పట్టుకుని కనికరించలేదన్నారు.

కనిగిరి లో వైయస్ఆర్‌సీపీ అభ్యర్థుల నామినేషన్ పత్రాలు చించేసినా టీడీపీ మూకలు

కనిగిరి స్వర్ణ సాగరం అక్టోబర్ 22

కనిగిరి మండలం ఎంపీడీవో కార్యాలయం వద్ద టీడీపీ గూండాలు ఎదురునిలిచి గురువారం నామినేషన్ దాఖలు చేసిన వైయస్ఆర్‌సీపీ అభ్యర్థులు దగ్గర నామినేషన్ పత్రాలను లాక్కుని చించేసిన టీడీపీ మూకలు.కనీసం ఒక్కరిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకోలేక పోకుండా ప్రశ్నించిన వైయస్ఆర్‌సీపీ అభ్యర్థులకి పోలీస్ లు బెదిరింపులు చేశారు.ఈ కార్యక్రమం గురించి కనిగిరి మండల అధ్యక్షులు మడతల కస్తూరి రెడ్డికనిగిరి మండలంలో వైయస్ఆర్‌సీపీ అభ్యర్థులను నామినేషన్ వేయనివ్వరా?మండల పార్టీ శ్రేణులతో కలిసి రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపిన టీడీపీ మూకల కంటే పోలీసులే అత్యుత్సాహంతో నామినేషన్లను అడ్డుకోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మడతలు కస్తూరి రెడ్డి మరియు ఎంపీటీసీ అభ్యర్థులు, మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు.

వైసీపీ నేతల అక్రమ అరెస్టులు,గృహ నిర్బంధాలు ! పోలీసుల ఏకపక్ష వైఖరిపై విమర్శలు

స్వర్ణసాగరం,సూళ్లూరుపేట అక్టోబర్ 22 :

సూళ్లూరుపేట మాజీ పురపాలక చైర్ పర్సన్ మరియు సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త వైకాపా పరిశీలకుడు దబ్బల శ్రీమంత్ రెడ్డిను గురువారం ఎంపీటీసీ నామినేషన్ల ప్రక్రియకు అభ్యర్థుల వెంట వెళ్లకుండా సూళ్లూరుపేట పోలీసులు గృహ నిర్బంధం చేశారు.ఇందులో భాగంగా సూళ్లూరుపేట మాజీ ఎంపీపీ అల్లూరు అనిల్ రెడ్డిని గురువారం అక్రమంగా అరెస్టు చేసి తడ పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు వైసీపీ నాయకులు వెల్లడించారు.ఇలాంటి అక్రమ అరెస్టులతో వైకాపా కార్యకర్తలను, నాయకులను బెదిరించలేరని వైకాపా నాయకులు స్పష్టం చేశారు.ఇలాంటి పరిణామాలకు తెదేపా కార్యకర్తలు కానీ,లేదా ఏకపక్షంగా వ్యవహరించే పోలీసు అధికారులు కానీ ప్రయత్నిస్తే రానున్న రోజుల్లో ప్రజలే బుద్ధి చెబుతారని వైకాపా నాయకులు హెచ్చరించారు.

జెడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్ల పై టీడీపీ భారీ ర్యాలీ

స్వర్ణసాగరం బుచ్చినాయుడుకండ్రిగ

మండలంలో జెడ్పీటీసీ, శకుంతలమ్మ ఎంపీటీసీ.గంగమ్మ అనిత. నామినేషన్ల సందర్భంగా తెలుగుదేశం పార్టీ శ్రేణులు గురువారం భారీ ర్యాలీ నిర్వహించాయి. మండల పార్టీ అధ్యక్షుడు చెంచురామయ్య నాయుడు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు.భారీ ర్యాలీతో మండలంలో టీడీపీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది. పార్టీ నాయకులు మాజీ గ్రంథాలయ చైర్మన్ కన్నయ్య నాయుడు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు సీఎం గా ఉంటే పరిశ్రమలో ఎన్నో వస్తాయని చెప్పాడు. మండల పార్టీ మాజీ అధ్యక్షుడు సుధాకర్ నాయుడు మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి లోకేష్ బాబు. డీఎస్సీ ఎన్నో పోస్టు ఇచ్చారని చెప్పారు, ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల సెక్రెటరీ రవి నాయుడు ఐటిడిపి విజయ్,జనసేన కార్యకర్తలు ,బిజెపి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

చెప్పాం.. చేస్తున్నాం!

కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై పోస్టర్ విడుదల,

స్వర్ణసాగరం- శ్రీకాళహస్తి,

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాల వివరాలతో రూపొందించిన 'చెప్పాం.. చేస్తున్నాం' పోస్టర్‌ను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి గురువారం నాయకులతో కలిసి విడుదల చేశారు.ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రాధాన్యాలను వివరించారు. పట్టణాలు, గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పారిశుధ్యం, తాగునీటి వసతులు, రహదారుల నిర్మాణం వంటి కార్యక్రమాలతో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు.ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు వివరించడంలో భాగంగానే పోస్టర్‌ను విడుదల చేసినట్లు వెల్లడించారు.

నామినేషన్‌కు వెళ్తుండగా దాడి!

కాసరం ఎంపీటీసీ అభ్యర్థి లావణ్య ఆరోపణ,

ప్రతిపాదకుడు సురేష్‌రెడ్డికి గాయాలు.. నామినేషన్ పత్రాలు చించేశారని వైసీపీ నేతల ఆరోపణ,

స్వర్ణసాగరం -తొట్టంబేడు,

తొట్టంబేడు మండలం కాసరం ఎంపీటీసీ అభ్యర్థి లావణ్య, ఆమె నామినేషన్ ప్రతిపాదకుడు సురేష్‌రెడ్డిపై టీడీపీ నాయకులు దాడికి పాల్పడ్డారని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపించారు. గురువారం నామినేషన్ కేంద్రానికి వెళ్తుండగా వారిని అడ్డుకుని దాడి చేశారని, నామినేషన్ పత్రాలను బలవంతంగా లాక్కొని చించివేశారని అభ్యర్థి లావణ్య పేర్కొన్నారు. ఈ ఘటనలో సురేష్‌రెడ్డికి తలకు తీవ్ర గాయాలయ్యాయని, వైఎస్సార్‌సీపీ శ్రేణులు అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించాయని తెలిపారు.

దాడిని ఖండించిన వైసీపీ నేతలు,...ఈ ఘటనను వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవ నాయుడు తీవ్రంగా ఖండించారు. ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో తమ పార్టీ అభ్యర్థులను, ప్రతిపాదకులను అడ్డుకుంటూ దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కాసరం ఎంపీటీసీ అభ్యర్థి లావణ్య ప్రతిపాదకుడు సురేష్‌రెడ్డిపై దాడి చేయడం దారుణమన్నారు. నామినేషన్ పత్రాలను సైతం చించివేశారని ఆవేదన వ్యక్తం చేశారు.తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇలాంటి పరిస్థితులను చూడలేదని పేర్కొన్నారు. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘం, పోలీసు యంత్రాంగంపై ఉందన్నారు. జిల్లా ఎస్పీ, శ్రీకాళహస్తి డీఎస్పీ తక్షణమే జోక్యం చేసుకుని తమ పార్టీ అభ్యర్థులకు రక్షణ కల్పించాలని, నామినేషన్లు దాఖలు చేసేందుకు సహకరించాలని కోరారు. న్యాయం జరగకపోతే కోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా నామినేషన్లు వేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

పోలీసుల రక్షణ కల్పించాలి,...తొట్టంబేడు మాజీ ఎంపీపీ కోవి చంద్రయ్య నాయుడు మాట్లాడుతూ.. తమ పార్టీ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఎన్నికల్లో పోటీ చేస్తే ఓడిపోతామనే భయంతోనే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో పోటీ చేయడానికి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ నామినేషన్ వేసే అవకాశం ఉండాలని పేర్కొన్నారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించకుండా, అన్ని పార్టీల అభ్యర్థులకు సమానంగా రక్షణ కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు డాక్టర్ కోగిల సుబ్రహ్మణ్యం, చింత రాజేంద్ర, నెలవల ప్రసాద్, మణి నాయుడు, లావణ్య, కోగిల నాగరాజు, పల్లవి, సుహాసిని, రేవతి, మునికృష్ణయ్య, వెంకటేష్, తుపాకుల చెంచయ్య, గంధం మణి తదితర మండల నాయకులు పాల్గొన్నారు.

జెడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికలకు సంబంధించి స్ట్రాంగ్ రూంలు,కౌంటింగ్ కేంద్రాల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ఏలూరు,స్వర్ణ సాగరం ప్రతినిధి అశోక్

ఏలూరు జిల్లాలో జెడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికలకు సంబంధించి స్ట్రాంగ్ రూంలు,కౌంటింగ్ కేంద్రాల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు చేయాలనీ జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు,జిల్లాలో జెడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికలకు సంబంధించి స్ట్రాంగ్ రూంలు,కౌంటింగ్ ఏర్పాట్లపై అధికారులతో గురువారం జూమ్ కాన్ఫెరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు,ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ స్ట్రాంగ్ రూమ్,రిసెప్షన్ కేంద్రం ఏర్పాట్లను రిటర్నింగ్ అధికారులు దగ్గరుండి పరిశీలించాలన్నారు, రిసెప్షన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్ ల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటుచేయాలని,వీడియో చిత్రీకరణ చేయించాలన్నారు,స్ట్రాంగ్ రూమ్ లలో బ్యాలెట్ బాక్సులు భద్రపరిచేందుకు ప్రతీ బ్యాలెట్ బాక్స్ నెంబర్ తో మార్కింగ్ చేయించాలన్నారు, కౌంటింగ్ కేంద్రాలలో ఓట్ల సంఖ్యకు అనుగుణంగా టేబుల్స్ ఏర్పాటు చేయాలనీ,కౌంటింగ్ సిబ్బంది,రాజకీయపక్షాల ప్రతినిధులు ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు వేరువేరుగా ఉండేలా చూడాలన్నారు. స్ట్రాంగ్ రూమ్ ల వద్ద రెండంచెల భద్రత వ్యవస్థను ఏర్పాటుచేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద ఓట్ల కౌంటింగ్ సమయంలో వీడియో చిత్రీకరణతోపాటు, సిసి కెమెరాలు ఏర్పాటుచేయాలన్నారు,జిల్లా జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ, నూజివీడు సబ్ కలెక్టర్ బి.వినూత్న, అసిస్టెంట్ కలెక్టర్ సిహెచ్. శ్రావణ్ కుమార్ రెడ్డి,జిల్లా పరిషత్ సీఈఓ ఎం.కృష్ణ మోహన్, ఆర్డీఓ లు లక్ష్మీప్రసన్న, రమణ, ఆర్ఓ లు,ఏఆర్ఓలు, పాల్గొన్నారు.ఎన్ఐసి అధికారులు ఫణికృష్ణ,సుజాత, ప్రభృతులు పాల్గొన్నారు.

అడ్డంకులను అధిగమించి నామినేషన్ దాఖలు కాంగ్రెస్ అభ్యర్థి బొగ్గుల సురేష్!

సూళ్లూరుపేటలో నామినేషన్ వివాదం.. ప్రతిపక్షాల,టీడీపీ మధ్య రాజకీయ వేడి!

కాంగ్రెస్ అభ్యర్థికి అండగా నిలిచిన పార్టీ ఇన్‌చార్జ్ డి.కిరణ్ కుమార్

స్వర్ణ సాగరం,సూళ్లూరుపేట అక్టోబర్ 22 :

ఎంపీటీసీ స్థానిక సంస్థ నామినేషన్లలో రాజకీయ రగడ మొదలైంది,సూళ్లూరుపేటలో రాజకీయ వాతావరణం వేడెక్కింది.నామినేషన్ దాఖలు చేయాలని వచ్చిన కాంగ్రెస్ అభ్యర్థికి అడ్డంకులు ఎదురయ్యాయన్న ఆరోపణలు స్థానికంగా కలకలం రేపాయి.ఎన్ని ఆటంకాలు ఎదురైనా వెనక్కి తగ్గకుండా కాంగ్రెస్ పార్టీ తన పట్టును ప్రదర్శించింది.ఆబాక గ్రామానికి చెందిన కాంగ్రెస్ ఎంపీటీసీ అభ్యర్థి బొగ్గుల సురేష్ గురువారం ఎట్టకేలకు తన నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారులకు సమర్పించారు.వివరాల మేరకు సూళ్లూరుపేట మండల పరిషత్ ఎంపీటీసీ స్థానిక ఎన్నికల్లో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ తరపున బొగ్గుల సురేష్ పోటీకి సిద్ధమయ్యారు.ఈ క్రమంలో బుధవారం సూళ్లూరుపేట ఎంపీడీవో కార్యాలయంలోని నామినేషన్ కేంద్రం వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. నామినేషన్ పత్రాలను చించివేసి, నామినేషన్ దాఖలు చేయకుండా టీడీపీకి చెందిన కొందరు నాయకులు అడ్డుకున్నారని పేర్కొన్నారు.ఈ ఘటన ఎన్నికల ప్రక్రియలో తీవ్ర చర్చకు దారితీసింది.నామినేషన్ కేంద్రం వద్ద ఎన్నికల రిటర్నింగ్ అధికారి, సీఐ యం.మురళీకృష్ణ,ఎస్సై.అజయ్ కుమార్ సమక్షంలోనే ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు.ఎన్నికల్లో పోటీ చేసే ప్రతి అభ్యర్థికి సమాన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందని,నామినేషన్ ప్రక్రియ పారదర్శకంగా సాగాలని డిమాండ్ చేశారు.

అడ్డంకులు ఎదురైనా వెనక్కి తగ్గని కాంగ్రెస్!

బుధవారం చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ డి.కిరణ్ కుమార్ రంగంలోకి దిగారు. పార్టీ అభ్యర్థి బొగ్గుల సురేష్‌కు అండగా నిలిచి,నామినేషన్ దాఖలు చేసే వరకు పార్టీ శ్రేణులతో కలిసి ప్రయత్నాలు కొనసాగించారు.ఈ క్రమంలో గురువారం బొగ్గుల సురేష్ తన నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారులకు సమర్పించారు.ఈ సందర్భంగా డి.కిరణ్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులను,కార్యకర్తలను రాజకీయంగా అణచివేయాలనే ప్రయత్నాలు ఎప్పటికీ ఫలించబోవని స్పష్టం చేశారు.ఎన్ని అడ్డంకులు సృష్టించినా,ఎలాంటి ఒత్తిళ్లు తీసుకొచ్చినా కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య పద్ధతిలో తన పోరాటాన్ని కొనసాగిస్తుందని పేర్కొన్నారు.ప్రజాస్వామ్యంలో ఎన్నికలు స్వేచ్ఛగా,నిష్పక్షపాతంగా జరగాలని,ప్రతి అభ్యర్థికి తన నామినేషన్ దాఖలు చేసుకునే అవకాశం ఉండాలని ఆయన అన్నారు. అధికార యంత్రాంగం రాజకీయాలకు అతీతంగా వ్యవహరించి ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించాలని కోరారు.

ఆత్మహత్య నుండి వ్యక్తి ప్రాణాలు కాపాడిన పోలీసులు

రేణిగుంట స్వర్ణ సాగరం అక్టోబర్ 22

డయల్ 112 అత్యవసర కాల్‌కు సకాలంలో స్పందించి రేణిగుంట రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్యకు యత్నించిన లోకేష్ అనే వ్యక్తి ప్రాణాలను పోలీసులు కాపాడారు. అత్యవసర సేవల నంబర్ 112కు వచ్చిన కాల్‌కు సకాలంలో స్పందించి ఓ వ్యక్తి ప్రాణాలను రేణిగుంట పోలీసులు కాపాడారు. తిరుపతికి చెందిన లోకేష్ తాను చనిపోతానని కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా చెప్పడంతో ఆందోళనకు గురైన వారు వెంటనే 112కు కాల్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు 112 ద్వారా అందిన లొకేషన్ ఆధారంగా లోకేష్ రేణిగుంట సమీపంలోని రైల్వే ట్రాక్‌పై ఉన్నట్లు గుర్తించారు. వెంటనే స్పందించిన రేణిగుంట పోలీస్ స్టేషన్ రైటర్ సి.వి. చలపతి, కానిస్టేబుల్ త్రినాథ్ అక్కడికి చేరుకుని అతడిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు సమయస్ఫూర్తితో వ్యవహరించి తక్షణమే స్పందించడంతో ఓ ప్రాణాన్ని కాపాడగలిగారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు వెంటనే 112కు కాల్ చేసి పోలీసుల సహాయం పొందాలని రేణిగుంట పోలీసులు సూచించారు.'

నామినేషన్ల రేసులో టీడీపీ అత్యధికం

40 నామినేషన్లతో ముదుంజు

రేణిగుంట స్వర్ణ సాగరం అక్టోబర్ 22

రేణిగుంట మండలంలో ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ రెండో రోజైన గురువారం కొనసాగింది. మండలంలో మొత్తం 21 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనుండగా, రెండో రోజు 53 నామినేషన్లు దాఖలయ్యాయి. దీంతో ఇప్పటివరకు మొత్తం నామినేషన్ల సంఖ్య 55కు చేరినట్లు అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి పార్టీల వారీగా పరిశీలిస్తే తెలుగుదేశం పార్టీ (టీడీపీ) నుంచి అత్యధికంగా 40 నామినేషన్లు దాఖలయ్యాయి. బీజేపీ నుంచి 5, వైఎస్సార్‌సీపీ నుంచి 4, జనసేన పార్టీ నుంచి 3, సీపీఐ (ఎం) నుంచి 3 నామినేషన్లు నమోదయ్యాయి. ఆమ్ ఆద్మీ పార్టీ, బీఎస్పీ, కాంగ్రెస్, ఇతర పార్టీలు, స్వతంత్ర అభ్యర్థుల నుంచి ఎలాంటి నామినేషన్లు దాఖలు కాలేదు. రెండో రోజు నామినేషన్ల ప్రక్రియతో రేణిగుంట మండలంలో ఎన్నికల సందడి మరింత పెరిగింది. రానున్న రోజుల్లో మరిన్ని నామినేషన్లు దాఖలయ్యే అవకాశం ఉంది.

వైసీపీ అభ్యర్థులపై దాడులు అప్రజాస్వామికం!

నామినేషన్లు వేసేలా పోలీసుల రక్షణ కల్పించాలి

నామినేషన్ పత్రాలు చించివేశారని ఆరోపణ

తొట్టంబేడు వైసీపీ మండల అధ్యక్షుడు డాక్టర్ కోగిల సుబ్రహ్మణ్యం,

స్వర్ణసాగరం -- తొట్టంబేడు,

ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల సందర్భంగా వైసీపీ అభ్యర్థులపై దాడులకు పాల్పడటం, నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం అప్రజాస్వామికమని తొట్టంబేడు మండల వైసీపీ అధ్యక్షుడు డాక్టర్ కోగిల సుబ్రహ్మణ్యం ఆరోపించారు. తమ అభ్యర్థులు ఎలాంటి అడ్డంకులు లేకుండా నామినేషన్లు దాఖలు చేసేలా పోలీసులు తక్షణమే రక్షణ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికార పార్టీ నేతలు తమ అభ్యర్థులపై దౌర్జన్యానికి దిగుతున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో పోటీ చేసే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, అయితే నామినేషన్లు దాఖలు చేయడానికి వెళ్తున్న తమ అభ్యర్థులను అడ్డుకోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. తాను విద్యావేత్తగా, వైద్యుడిగా ఉన్నప్పటికీ నామినేషన్ వేసేందుకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.వెనుకబడిన వర్గాలకు చెందిన తమ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు పోలీసు అధికారులను వేడుకున్నా స్పందన లేదని ఆయన ఆరోపించారు. తమ చేతిలోని నామినేషన్ పత్రాలను సైతం చించివేశారని పేర్కొన్నారు. మహిళా అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడంతోపాటు, పత్రాలను లాక్కొని చించివేయడం, ప్రతిపాదకులపై భౌతిక దాడులకు పాల్పడటం దారుణమన్నారు.ఈ ఘటనలపై జిల్లా ఎస్పీ, శ్రీకాళహస్తి డీఎస్పీ తక్షణమే స్పందించి తమ అభ్యర్థులకు తగిన రక్షణ కల్పించాలని కోరారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించకుండా, ప్రతి అభ్యర్థికి నామినేషన్ దాఖలు చేసే అవకాశం కల్పించి, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఎన్ని అడ్డంకులు ఎదురైనా నామినేషన్లు దాఖలు చేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుంటామని డాక్టర్ కోగిల సుబ్రహ్మణ్యం స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సూళ్లూరుపేటలో రాజకీయ రగడ ! 144 సెక్షన్ అమలు ఎక్కడ?

రెండవ రోజు నామినేషన్లకు వెళ్లనివ్వకుండా అభ్యర్థులను అడ్డుకున్న టీడీపీ శ్రేణులు!

నామినేషన్ కేంద్రం వద్దకు భారీగా తరలివచ్చిన టీడీపీ శ్రేణులు

స్వర్ణ సాగరం,సూళ్లూరుపేట అక్టోబర్ 22:

ఎన్నికల వేళ సూళ్లూరుపేటలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. సూళ్లూరుపేట నామినేషన్ల దాఖలు ఎంపీడీఓ కార్యాలయం వద్ద మొదటి రోజు చోటుచేసుకున్న పరిణామాలకు భిన్నంగా రెండవ రోజు భారీ ఎత్తున టీడీపీ శ్రేణులు నామినేషన్ కేంద్రం వద్దకు తరలివచ్చారు.ఈ నేపథ్యంలో నామినేషన్ దాఖలుకు వచ్చిన అభ్యర్థులను అడ్డుకోవడం ప్రజల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.నామినేషన్లు దాఖలుకు వచ్చిన వైకాపా మహిళా అభ్యర్థిని నామినేషన్ కేంద్రానికి వెళ్లనివ్వకుండా అడ్డుకున్న టీడీపీ చోటా నాయకులపై వైకాపా మహిళా అభ్యర్థి విమర్శలకు దిగారు.ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి నామినేషన్ వేసుకోవడం హక్కు అని, అలాంటి హక్కులను అడ్డుకుని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారంటూ మండిపడ్డారు.నిజమైన ప్రజా క్షేత్రంలో ప్రజల కోసం పనిచేసే ప్రతి నాయకుడు అల్లరి మూకల్లా వ్యవహరించకుండా,ప్రతి పౌరుడి హక్కును వినియోగించుకునే అవకాశాన్ని కల్పిస్తేనే ప్రజాస్వామ్యబద్ధమైన రాజకీయ నాయకులుగా,ప్రజల సేవకులుగా పరిగణిస్తారునీ హితబోధ చేశారు.ఇలాంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడడం సమంజసం కాదని, ప్రజా క్షేత్రంలో ప్రజా సమస్యలపై పోరాడే నాయకులుగా నిలవాలని సూచించారు.

పోలీసుల పాత్రపై విమర్శలు 144 సెక్షన్ అమల్లో ఉందని ప్రచారం మాత్రమే :

ఇలా అడ్డుకోవడం సాక్షాత్తు పోలీసుల సమక్షంలోనే జరుగుతున్నా, మహిళలపై అరాచకాలకు పాల్పడుతున్న వారిని అడ్డుకునే ప్రయత్నం చేయకుండా పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని విమర్శించారు.సుప్రీం కోర్ట్ ఆదేశాలు ఉన్నప్పటికీ,ప్రతి అభ్యర్థికి పోలీసులు రక్షణ కల్పించి నామినేషన్ దాఖలుకు కేంద్రానికి తీసుకువెళ్లాలని ఆదేశాలు ఉన్నాయి. దీనికి భిన్నంగా సూళ్లూరుపేటలో నామినేషన్ కేంద్రాల వద్ద స్వయానా పోలీసులు టిడిపి నాయకులకు ఆదరిస్తున్నారని విమర్శలు. ఈ నేపథ్యంలో నామినేషన్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ప్రచారం చేసిన పోలీసు అధికారులు,గుంపులు గుంపులుగా టీడీపీ శ్రేణులు బారులు తీరి అడ్డంకులు సృష్టిస్తూ,అసభ్యకరంగా ప్రవర్తిస్తూ,దాడులకు తెగబడుతున్నా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోకుండా,దీనికి విరుద్ధంగా నామినేషన్ దాఖలుకు వచ్చిన తమ నాయకులపై అక్రమ కేసులు,అక్రమ అరెస్టులు చేస్తున్నారంటూ వైకాపా శ్రేణులు మండిపడ్డారు.దీంతో పోలీసుల పాత్రపై తీవ్రస్థాయిలో విమర్శలు రేపుతున్నాయి.ప్రజాస్వామ్యంలో ప్రజలకు రక్షణ కల్పించాల్సిన రక్షకభటులే సాక్షాత్తు దగ్గరుండి ఇలాంటి కార్యకలాపాలను ప్రోత్సహిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనది

పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి

సూర్యాపేట.స్వర్ణసాగరం. అక్టోబర్22:

సూర్యాపేట పట్టణ కేంద్రంలో 15వ వార్డు కౌన్సిలర్ పిల్లల భవాని రమేష్ నాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి ఖమ్మం--వరంగల్--నల్గొండ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా. తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత. పాల్గొన్నారు.ఈ సందర్భంగా పటేల్ రమేష్ రెడ్డి.మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని,అర్హులైన ప్రతి పట్టభద్రుడు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవడం బాధ్యతగా భావించాలని సూచించారు. ఓటర్ల నమోదు ప్రక్రియపై పట్టభద్రులకు అవగాహన కల్పించడంతో పాటు, నమోదు సమయంలో అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు సహాయ కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఓటును నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి ఖమ్మం--వరంగల్--నల్గొండ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పట్టభద్రులను కోరారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, పట్టభద్రులంతా ఐక్యంగా ముందుకు వచ్చి ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సూర్యాపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు,48వ వార్డు కౌన్సిలర్ వెలుగు వెంకన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా,వార్డు కౌన్సిలర్లు, పాల్గొన్నారు.ద

పూడి ఎంపీటీసీ స్థానానికి టీడీపీ అభ్యర్థి నామినేషన్

పూడి ఎంపీటీసీ స్థానానికి టీడీపీ అభ్యర్థిగా అద్దూరు అంకమ్మ

మహిళా రిజర్వుడు స్థానానికి నామినేషన్.. అభ్యర్థికి పార్టీ శ్రేణుల అభినందనలు,

స్వర్ణసాగరం -తొట్టంబేడు,

తొట్టంబేడు మండలంలోని పూడి ఎంపీటీసీ స్థానానికి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా అద్దూరు అంకమ్మ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. మహిళలకు రిజర్వు చేసిన ఈ స్థానానికి సంబంధించి మండల కార్యాలయంలో ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు అద్దూరు సురేష్ మాట్లాడుతూ.. పార్టీ కోసం నిస్వార్థంగా పనిచేసే కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ గుర్తింపు ఇస్తుందని పేర్కొన్నారు. గత ఎన్నికల్లోనూ అద్దూరు అంకమ్మ బూత్ స్థాయిలో చురుగ్గా పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేశారని తెలిపారు. ఆమె పార్టీ పట్ల చూపిన నిబద్ధతకు గుర్తింపుగా ఎంపీటీసీ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం లభించిందన్నారు.మహిళా సాధికారతకు ప్రాధాన్యమిస్తూ, సామాన్య కార్యకర్తల కుటుంబాలకు రాజకీయ అవకాశాలు కల్పించడంలో టీడీపీ ముందుంటుందని సురేష్ పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ పాలన సాగిస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

నేల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం..

రైతులకు 'ఖేత్ బచావో అభియాన్'పై అవగాహన

డోర్నకల్ మండలంలో నాలుగు కేంద్రాల్లో ప్రత్యేక కార్యక్రమాలు

రసాయన ఎరువుల వినియోగం తగ్గించి, సాగు ఖర్చులు ఆదా చేసుకోవాలని సూచన

స్వర్ణ సాగరం డోర్నకల్ అక్టోబర్ 22

డోర్నకల్: రైతులకు సాగు ఖర్చులు తగ్గించుకోవడంతో పాటు భూసారాన్ని కాపాడుకుంటూ మెరుగైన దిగుబడులు సాధించేలా అవగాహన కల్పించేందుకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'ఖేత్ బచావో అభియాన్' కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా డోర్నకల్ మండల ంలోని గొల్లచెర్ల, చిలుకోడు, అమ్మపాలెం రైతువేదికల్లో రైతులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం, అధిక రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించడం, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించడం, పంట వ్యర్థాలను కాల్చకుండా నేలలో కలియదున్నడం వంటి అంశాలను వివరించారు.పంటలకు అవసరమైన మేరకే ఎరువులు వినియోగించడం, భూసారాన్ని పరిరక్షించడం ద్వారా అనవసర పెట్టుబడులను తగ్గించుకోవచ్చుని, దీర్ఘకాలంలో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవడానికి భూసార పరిరక్షణ కీలకమని అవగాహన కల్పించారు.

నాలుగు కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు

డోర్నకల్ మండలంలో రైతులకు మరింత విస్తృతంగా అవగాహన కల్పించేందుకు వ్యవసాయ శాఖ ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది.ఇందులో భాగంగా అక్టోబర్ 23న చిలుకోడు రైతువేదికలో, అక్టోబర్ 24న ములకలపల్లి గ్రామ పంచాయతీలో, నవంబర్ 3న అమ్మపాలెం రైతువేదికలో, నవంబర్ 13న గొల్లచెర్ల రైతువేదికలో కార్యక్రమాలు నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమాల్లో రైతులు పాల్గొని శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంపొందించుకోవాలని, అధికారుల సూచనలను పాటిస్తూ నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వ్యవసాయ శాఖ కోరింది.గొల్లచెర్ల కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేశ్వర్లు, పాతదుబ్బ సర్పంచ్ శ్రీను, మండల వ్యవసాయ అధికారి కె. అనిల్ కుమార్, వెటర్నరీ డాక్టర్ కార్తిక, ఏఈవోలు అనూష, పవన్, లెనిన్, అవినాష్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు ఈ కార్యక్రమాల్లో భాగస్వాములై విజయవంతం చేయాలని డోర్నకల్ మండల వ్యవసాయ శాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు

మార్కాపురం మెప్మా కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ కనిగిరి జడ్పీటీసీ అభ్యర్థి మల్లెల ప్రవీణ్ కుమార్ నామినేషన్ దాఖలు!

కనిగిరి స్వర్ణ సాగరం అక్టోబర్ 22

స్థానిక సంస్థల ఎన్నికల పర్వంలో భాగంగా మార్కాపురం మెప్మా కార్యాలయం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (గా=జూ) కనిగిరి నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ దద్దాల నారాయణ యాదవ్ ఆదేశాల మేరకు. కనిగిరి మండలం జడ్పీటీసీ (గ్రాజ) వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గా మల్లెల ప్రవీణ్ కుమార్ గురువారం తన నామినేషన్ పత్రాలను అత్యంత అట్టహాసంగా సమర్పించారు.ఈ నామినేషన్ల దాఖలు కార్యక్రమానికి కనిగిరి మండలానికి చెందిన వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు, అనుచరులు పాల్గొన్నారు.నిరంతరం ప్రజాసేవలో ఉంటూ, పార్టీ పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో విజయవంతం నాయకులు కనిగిరి జడ్పీటీసీ ఎన్నికల బరిలో నిలవడంతో పార్టీ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహం నెలకొంది. క్షేత్రస్థాయిలో పనిసేసి ఈ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో కనిగిరి స్థానాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోబోతోందని పార్టీ ముఖ్య నేతలు అత్యంత ధీమా వ్యక్తం చేశారుసెట్టిపల్లి కొండయ్య ఏనుబరి కిరణ్ మల్లెల యాకోబు బాబు పౌల్ జేమ్స్ రామకోటయ్య తదితరులు పాల్గొన్నరు.

సిల్వర్ జూబ్లీ దిశగా...

తెలుగు చలనచిత్ర పరిశ్రమలో సిల్వర్ జూబ్లీ దిశగా ప్రయాణం కొనసాగిస్తున్నారు హీరో ప్రభాస్. 'ఈశ్వర్' (2002) సినిమాతో మొదలైన ప్రభాస్ సిల్వర్ స్క్రీన్ జర్నీ 24 ఏళ్లుగా బాక్సాఫీస్ వద్ద కొత్త రికార్డులు క్రియేట్ చేస్తూ సక్సెస్‌ఫుల్‌గా కొనసాగుతోన్న విషయం తెలిసిందే. ఆయన నటించిన తొలి చిత్రం 'ఈశ్వర్' 2002 నవంబరు 11న విడుదలై, హిట్‌గా నిలిచింది. ఈ లెక్కన నవంబరులో తన కెరీర్‌లో 25 ఏళ్ల మైల్‌స్టోన్‌లోకి (సిల్వర్ జూబ్లీ) అడుగుపెడుతున్న ప్రభాస్... వరుస భారీ పాన్ ఇండియా మూవీస్‌తో బిజీ బిజీగా దూసుకెళుతుండటం విశేషం. పాన్ ఇండియా స్టార్‌డమ్ దాటేసి, గ్లోబల్ స్థాయిలో ఫ్యాన్ బేస్ సంపాదించుకున్న ప్రభాస్ పుట్టినరోజు నేడు (అక్టోబరు 23). 'బాహుబలి' (2015) సినిమాతో మొదలైన ప్రభాస్ పాన్ ఇండియా జర్నీ దిగ్విజయంగా కొనసాగుతోంది. ప్రభాస్ సినిమాలు బాలీవుడ్ స్టార్స్‌తో పోటీ పడేంతగా ఉత్తరాదిలోనూ వసూళ్లు సాధిస్తున్నాయి. 'బాహుబలి 2, కల్కి 2898 ఏడీ' సినిమాలతో రూ. వెయ్యి కోట్ల గ్రాస్ కలెక్షన్స్ రెండు సార్లు సాధించిన ఏకైక స్టార్ ప్రభాస్. ఓవర్సీస్ మార్కెట్‌లో పది మిలియన్లకు పైగా వసూళ్లను సాధించిన తొలి హీరోగా రికార్డ్ సాధించారు. ఇక కెరీర్‌లో 25 ఏళ్ల మైల్‌స్టోన్‌ని టచ్ చేయనున్న ప్రభాస్ హీరోగా దూసుకెళుతున్నారు. ఇందుకు నిదర్శనం ఈ హీరో డైరీలో ప్రస్తుతం నాలుగు సినిమాలు ఉండటమే. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో 'స్పిరిట్', హను రాఘవపూడి దర్శకత్వంలో 'ఫౌజీ', నాగ్ అశ్విన్ డైరెక్షన్‌లో 'కల్కి 2', ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో 'సలార్ 2' వంటి భారీ సినిమాలతో ప్రభాస్ ఫుల్ బిజీగా ఉన్నారు.

స్త్రీల రాజ్యమేలుతున్న పెన్నురు గడ్డపై పవర్ వార్.. కీర్తి సురేష్ 'అక్క' ట్రైలర్ అదుర్స్!

ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్ తెరకెక్కించిన క్రైమ్ డ్రామా సిరీస్ 'అక్క' ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. నేషనల్ అవార్డు గ్రహీత కీర్తి సురేష్, టాలెంటెడ్ నటి రాధికా ఆప్టే ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సిరీస్‌పై ప్రేక్షకుల్లో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. వైఆర్‌ఎఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ 7(=ఖీ జుత్‌వఱుఱఅవత్) నిర్మించిన ఈ సిరీస్‌కు ధర్మరాజ్ శెట్టి రచన, దర్శకత్వం వహించారు. పూర్తిగా మహిళల చేతుల్లో సాగే ఒక విభిన్న రాజ్యాన్ని, వారి మధ్య జరిగే పవర్ పాలిటిక్స్‌ను ఈ సిరీస్‌లో ఆవిష్కరించనున్నారు. అక్టోబర్ 30 నుంచి ఈ సిరీస్ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. ట్రైలర్ చూస్తుంటే.. పెన్నురు అనే కల్పిత రాజ్యంలో గత 800 ఏళ్లుగా కేవలం మహిళలదే పూర్తి ఆధిపత్యం. ఇక్కడ కుటుంబాలు, వ్యాపారాలు అన్నీ మహిళల కంట్రోల్‌లోనే ఉంటాయి. కుటుంబంలో అత్యున్నత అధికారం చెలాయించే మహిళను 'అక్క' అని పిలుస్తారు. ప్రేమకు, పెళ్లికి సంబంధించి ఈ సమాజం కొన్ని ప్రత్యేకమైన నిబంధనలను పాటిస్తుంది. అయితే, రుద్ర (రాధికా ఆప్టే) రాకతో ఈ వ్యవస్థలో ఒక్కసారిగా మార్పులు చోటు చేసుకుంటాయి. రుద్ర అంచనాలు, ఆమె ఆశయాలు భవాని (కీర్తి సురేష్)తో తీవ్ర ఘర్షణకు దారితీస్తాయి. ఈ ఇద్దరు బలమైన మహిళల మధ్య జరిగే ఆధిపత్య పోరు, వంశాచారాన్ని కాపాడుకునే ప్రయత్నం వంటి అంశాల చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ఈ చిత్రంలో తన్వి అజ్మి, మహేష్ మంజ్రేకర్, అన్నుమన్ పుష్కర్, మోనికా పన్వార్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. నెట్‌ఫ్లిక్స్, వైఆర్‌ఎఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ క్రైమ్ డ్రామా అక్టోబర్ 30న ప్రేక్షకుల ముందుకు రానుంది.

321' కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రం

బ్రహ్మ ఆర్ట్ క్రియేషన్స్ బ్యానర్ మీద శాంతి కుమార్ చిలుముల, రామానుజ రెడ్డి వంగపాటి నిర్మాణంలో శాంతి కుమార్ చిలుముల తెరకెక్కించిన చిత్రం '321'. ఉప శీర్షిక లవ్ మ్యారేజ్ వర్సెస్ అరెంజ్డ్. ఈ సినిమాలో మోహిత్, లావణ్య జంటగా నటించారు. ఈ చిత్రాన్ని అక్టోబర్ 23న విడుదల చేయబోతోన్నారు.. ఈ క్రమంలో బుధవారం నాడు చిత్రాన్ని ప్రత్యేకంగా ప్రదర్శించారు. అనంతరం చిత్రయూనిట్ మీడియాతో ముచ్చటించింది. ఈ కార్యక్రమంలో..
దర్శక, నిర్మాత శాంతి కుమార్ మాట్లాడుతూ .. 'నాకు ఈ జర్నీలో తోడుగా నిలిచిన మోహన్ గారు, మయూర్ పట్నాల, మర్రి రాజశేఖర్ రెడ్డి గారికి థాంక్స్. ఐటీ అనేది నా ప్రొఫెషన్, ఆర్ట్స్ అనేది నా ప్యాషన్. ఈ చిత్రంలోని ఆర్టిస్టులంతా కూడా అద్భుతంగా నటించారు. మాధవి గారి సహకారం ఎప్పటికీ మర్చిపోలేం. ఆమె ఇచ్చిన రిఫరెన్సులతోనే ఎంతో మంది ఆర్టిస్టుల్ని ఈ చిత్రంలో తీసుకున్నాం. కాల్విన్ జాయ్ మ్యూజిక్ బాగా వచ్చింది. మౌన శ్రీ గారు పాటలు రాయడమే కాకుండా ఈ సినిమాలో మంచి పాత్రను పోషించారు. మా సినిమా అద్భుతంగా వచ్చింది. కుటుంబ సమేతంగా చూసేలా మా చిత్రం ఉంటుంది. అక్టోబర్ 23న మా మూవీ రాబోతోంది. అందరూ చూసి సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.
నిర్మాత రామానుజ రెడ్డి మాట్లాడుతూ .. "నేను ఇండస్ట్రీలో చాలా మంది వద్ద అసిస్టెంట్ కెమెరామెన్‌గా పని చేశాను. శాంతి కుమార్ గారితో నాకు ఎన్నో ఏళ్ల నుంచి అనుబంధం ఉంది. ఈ మూవీతోనే నేను నిర్మాతగా పరిచయం కాబోతోన్నాను. ఈ సినిమా బాగుంటుంది. ఈ చిత్రాన్ని కచ్చితంగా అందరూ ఎంజాయ్ చేస్తారు' అని అన్నారు.
పబ్లిసిటీ డిజైనర్ వివా రెడ్డి మాట్లాడుతూ .. "321' టైటిల్, ఆ డిజైనింగ్‌లోనే కథ అంతా ఉంది. మూడు ముళ్లు, ఇద్దరు మనుషులు, ఒక జీవితం అని అర్థం వచ్చేలా డిజైన్ చేశాం. బ్రహ్మ ఆర్ట్ క్రియేషన్ లోగోని శాంతి కుమార్ గారు దగ్గరుండి డిజైన్ చేయించుకున్నారు. నాకు ఈ అవకాశం ఇచ్చిన శాంతి కుమార్ గారికి థాంక్స్' అని అన్నారు.

ఘనంగా డీఆర్‌ఆర్ ప్రొడక్షన్స్ తొలి చిత్రం ప్రారంభం

హైదరాబాద్: డీఆర్‌ఆర్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై తెరకెక్కనున్న తొలి చిత్రం 'ప్రొడక్షన్ నంబర్ 1' దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. డాక్టర్ దామోదర్ నేరేళ్ల తన డ్రీమ్ ప్రాజెక్టుగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శశాంక్ దువ్వూరు ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. రవి శివతేజ,భాస్కర్ పరమాత్ముని, సుబ్రహ్మణ్యం అల ప్రధాన పాత్ర ల్లో నటిస్తుండగా, నేహా పఠాన్ కథానాయికగా కనిపించనున్నారు. స్నేహం, ప్రేమ, కుటుంబ అనుబంధాలతో పాటు సైన్స్ ఫిక్షన్ అంశాలను మేళవిస్తూ విభిన్నమైన కథాంశంతో ఈ చిత్రాన్ని రూపొందించేందుకు చిత్ర బృందం సిద్ధమవుతోంది.

డ్రీమ్ ప్రాజెక్టుగా సినిమా నిర్మాణం

ఇండియన్ అమెరికన్ మెడికల్ అసోసియేషన్ (ఐఏఎంఏ) వ్యవస్థాపకులు, సీఈఓ డాక్టర్ దామోదర్ నేరేళ్ల వైద్య రంగంలో విశేష సేవలందిస్తున్నారు. గత 26 ఏళ్లుగా యూకే, అమెరికాలో వైద్య వృత్తిలో కొనసాగుతున్న ఆయనకు సినిమాలపై చిన్నప్పటి నుంచే ప్రత్యేక ఆసక్తి ఉంది. మారుమూల గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ సేవా కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొంటున్నారు. తన సినిమా ప్రయాణం గురించి నిర్మాత డాక్టర్ దామోదర్ నేరేళ్ల మాట్లాడుతూ.. చిన్నతనం నుంచే సినిమాలంటే ఎంతో ఇష్టమని తెలిపారు. మెగాస్టార్ చిరంజీవి నటించిన 'ఖైదీ' సినిమా చూడటానికి పాఠశాలకు వెళ్లకుండా వరంగల్ వెళ్లిన రోజులు కూడా ఉన్నాయని గుర్తుచేసుకున్నారు. ఇన్నాళ్లుగా తనలో ఉన్న సినిమా కలను నిజం చేసుకునే దిశగా అడుగులు వేస్తున్నానని, తన డ్రీమ్ ప్రాజెక్టు దసరా రోజున ప్రారంభం కావడం ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు. దర్శకుడు శశాంక్ దువ్వూరు చెప్పిన కథ తనకు ఎంతగానో నచ్చిందని, ప్రేమ, స్నేహం, కుటుంబ విలువలతో పాటు మంచి సందేశాన్ని అందించే అంశాలు ఇందులో ఉన్నాయని వివరించారు. దర్శకుడిగా శశాంక్‌కు ఇది తొలి చిత్రమైనప్పటికీ, ఆయన ప్రతిభపై, కథపై పూర్తి నమ్మకం ఉందని పేర్కొన్నారు.

వినోదంతో పాటు బలమైన కాన్సెప్ట్

దర్శకుడు శశాంక్ దువ్వూరు మాట్లాడుతూ.. గతంలో రష్మిక మందన్న నటించిన 'ది గర్ల్‌ఫ్రెండ్' చిత్రానికి అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశానని తెలిపారు. 'ఉల్టా' అనే షార్ట్‌ఫిలింను కూడా రూపొందించినట్లు వెల్లడించారు. ఇప్పుడు దర్శకుడిగా తన తొలి చిత్రాన్ని తెరకెక్కిస్తుండటం సంతోషంగా ఉందన్నారు. పైకి లైట్‌హార్టెడ్ ఎంటర్‌టైనర్‌లా కనిపించినప్పటికీ, ఈ సినిమాలో బలమైన కాన్సెప్ట్ ఉంటుందని చెప్పారు. ముగ్గురు యువకుల చుట్టూ తిరిగే కథలో వినోదంతో పాటు విభిన్నమైన అంశాలను ఆసక్తికరంగా ఆవిష్కరించనున్నట్లు వివరించారు.

Edited Printed Published & Owned by Embeti Kameswari. And Printed at VSR Publishers and Printers, #1-176, Vakadu Village and Post, Vakadu Mandal, Tirupati District, Andhra pradesh.
Published at VSR Publications, 1-176, Vakadu Village and Post, Vakadu Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR Embeti Kameswari, PRGI. NO. APTEL/26/A2367